సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 18-7-2025 15/-

# వేడెక్కుతున్న బిహార్ రాజకీయాలు



## “విలువలతో కూడిన జర్నలిజానికి నాంది పలకండి!”



సహజీవన భావనల సౌభ్రాతృ
# గీటురాయి
వారపత్రిక
## GEETURAI WEEKLY


Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in


**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 28 హైదరాబాద్
శుక్రవారం 18 జులై 2025 రూ.15-00
22 ముహర్రమ్ 1447 హిజ్రీ


**తొలిగీటు**

ఎవరయితే పరిపూర్ణ చిత్తశుద్ధితో **'లా ఇలాహ ఇల్లల్లాహు'** అనే సద్వచనాన్ని పలుకుతారో వారే ప్రళయదినాన నా సిఫారసుకు అర్హులవుతారు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**






**డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ..!?**

## లోపల...


| | | |
|---|---|---|
| దుబాయ్ డ్రీమ్స్ | ...... | 04 |
| వేడెక్కుతున్న బిహార్ రాజకీయాలు | ...... | 05 |
| మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) – 1 | ...... | 08 |
| "విలువలతో కూడిన జర్నలిజానికి నాంది పలకండి!" | ...... | 14 |
| పిల్లలను ప్రేమించండి | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| హిజ్రీ కొత్త సంవత్సరం... కోటి ఆశలతో మనం–2 | ...... | 21 |
| పాఠశాల విద్య ప్రక్షాళన తక్షణావసరం | ...... | 24 |
| గుండె లయ తప్పుతోంది | ...... | 26 |
| ధర్మసంస్థాపన – ముహర్రమ్ సందేశం | ...... | 28 |
| వివాహ బంధమే అసలైన జీవన మార్గం! | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| జ్ఞానానికి ఔచితీ విజ్ఞతలు కూడా తోడైతే.... | ...... | 34 |


**అనుకున్నంత సీన్ లేదు ...**



అన్నంత సీను లేదట
కాంగ్రేసు ప్రజాపాలన
అలవికాని హామీలు
పొందలేదట మన్నన!
గ్యారంటీల అమల్లో
చూపండి చిత్తశుద్ధి
పరస్పరం తిట్టుకొనే
వద్దండి పాడు బుద్ధి!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

# దుబాయ్ డ్రీమ్స్

దుబాయ్ నగరం ఇప్పుడు ఆకాశ హర్మ్యాలతో, కళ్ళు జిగేల్మనిపించే ఆకర్షణలతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలను మాత్రమే కాదు, ముఖ్యంగా భారతీయులను కూడా అధికంగా ఆకర్షిస్తోంది. ఈ ఆకర్షణ ఆధారంగానే ఇప్పుడు దుబాయ్ భారతీయులకు ఒక ఆఫర్ కూడా ఇస్తోంది. భారతీయులకే కాదు బంగ్లాదేశీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది.

ప్రపంచ పటంలో నిశితంగా చూస్తే కాని కనిపించని చిన్న దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. అందులో ఏడు స్వతంత్ర రాజ్యాలు న్నాయి. అందులో ఒకటి దుబాయ్. దుబాయ్‌లో ప్రజాస్వామ్యం లేదు, రాజరికం ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అబుధాబీ, దుబాయ్, షార్జా, అజ్మాన్, ఉమ్మల్ కువైన్, రాసుల్ ఖైమా, ఫుజైరా ఉన్నాయి. ఇందులో అబుధాబీ అతిపెద్దది. సగం కన్నా ఎక్కువ ప్రాంతం అబూదాబీయే ఉంది. మిగిలినవన్నీ చిన్న చిన్న రాజ్యాలు. ఇందులో దుబాయ్ ప్రాముఖ్యత ఏమిటంటే టూరిజానికి అది పెద్దపీట వేసింది.

దుబాయ్ టూరిజం ద్వారా చాలా పెద్ద సంఖ్యలో టూరిస్టులను ఆహ్వానిస్తుంది. అక్కడికి వెళ్ళిన పర్యాటకులు భారీగా ఖర్చు పెడతారు. దుబాయ్ ఆర్థిక వ్యవస్థకు ఇది పునాదిగా మారింది. దుబాయ్ నగరం ప్రపంచంలోని ప్రసిద్ధ నగరాల్లో ఒకటిగా మారింది. ఇక్కడ తలసరి ఆదాయం కాని, ఇతర సూచికలు కాని టాప్ స్థాయిలో ఉన్నాయి.

దుబాయ్ వెళ్లాలంటే పర్యాటకులకు టూరిస్టు వీసా, పనిచేయడానికి వెళ్ళే వారికి వర్కింగ్ వీసా ఇలా ఉన్నాయి. ఇప్పుడు గోల్డెన్ వీసా తీసుకువచ్చింది. ఈ వీసా ప్రకారం భారత కరెన్సీలో 23 లక్షల రూపాయలు చెల్లిస్తే చాలు గోల్డెన్ వీసా లభిస్తుంది. ఈ వీసా తీసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, వృత్తినిపుణులు ఎవరైనా గాని దుబాయ్ వచ్చి ఇక్కడ ఉండవచ్చు. అక్కడ తమ వృత్తినైపుణ్యంతో ఆదాయవృద్ధి పనులు చేపట్టవచ్చు.

అంటే దుబాయ్‌కి  లాభం కలిగించే పనులు చేయగలిగిన వారైతే ఈ వీసాతో దుబాయ్ వెళ్ళవచ్చు. ఈ వీసా తీసుకుంటే శాశ్వతంగా ఎప్పుడైనా సరే దుబాయ్ వెళ్ళి వస్తూ ఉండవచ్చు. దుబాయిలో శాశ్వత నివాసం ఏదీ కొనవలసిన అవసరం లేదు. అయితే క్రిమినల్ రికార్డులు ఉండరాదు, మనీలాండరింగ్ ఫిర్యాదులు ఉండరాదు, సోషల్ మీడియాలో మీ వ్యవహారశైలి బాగుండాలి వగైరా ఆంక్షలు కూడా ఉన్నాయి.

ఈ వీసాపై దుబాయ్ వెళ్ళిన వారు అక్కడ తమ ఆర్థిక కార్యకలాపాల్లో అక్కడి స్థానికులకు కూడా ఉద్యోగాలు ఇవ్వవచ్చును. జీవితాంతం ఎప్పుడైనా దుబాయి వెళ్ళి రావడమే కాదు, కుటుంబ సభ్యులను కూడా పిలుచుకు వెళ్ళవచ్చు.

అంటే – భారతదేశంలోని నిపుణులు, సైన్సు, సాంకేతికశాస్త్రం, కంప్యూటర్స్, స్టార్టప్స్, ఆర్ట్, రీసెర్చ్ అన్ని రంగాల్లోను ముందంజలో ఉన్నవారికి తమ దేశంలో ఎర్ర తివాచీ పరుస్తున్నారు. ఇక్కడ దుబాయి తెలివిగా వ్యవహరిస్తూ ఈ నిపుణులను తమ దేశానికి పిలుచుకుపోతోంది. దుబాయిలో ఆకాశాన్ని చుంబించే పెద్ద పెద్ద భవనాలు ఇటీవల చాలా కట్టారు. ఆ భవనాలను ఏం చేసు కుంటారు. వాటిని అద్దెకు ఇవ్వాలి. అక్కడి స్థానికులకు వాటి అవసరమే లేదు. ఇలా గోల్డెన్ వీసా ద్వారా వచ్చిన వారికి ఆ భవనాలను అద్దెకు ఇవ్వవచ్చు. ఇది దుబాయ్ ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.

దుబాయ్ గర్వంగా చెప్పుకునే మరో మాట ఏంటంటే, ఇక్కడ పెన్సిలు ముక్క కూడా ఎవ్వరు దొంగతనం చేయలేరు. పోలీసులకు పూర్తి అధికారాలిచ్చారు. రోడ్డు మీద పర్సు వదిలేస్తే, సాయంత్రం వచ్చి తీసుకెళ్ళవచ్చని కూడా దుబాయ్ గర్వంగా చెప్పుకుంటుంది. నిజంగా అలాగే జరుగుతుంది కూడా. పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతలు చాలా పటిష్టంగా వ్యవహరించడం తన ప్రత్యేకతగా మార్చుకుంది.

ఈ ఆకర్షణలు చూపించడం ద్వారా నిపుణులను, ప్రతిభ కలవారిని తమ దేశానికి వచ్చేలా చేస్తుంది దుబాయ్. అక్కడికి వెళ్ళిన వారు అక్కడి ఆర్థిక వ్యవస్థలో తమ పాత్ర ఎలాగూ పోషిస్తారు. దుబాయ్ ఉద్యోగాలకు వెళ్ళిన వారు అక్కడ సంపాదించి ఇక్కడకు పంపిస్తారు. కాని దుబాయ్ గోల్డెన్ వీసాపై వెళ్ళిన వారు అక్కడి ఆర్థిక వ్యవస్థకు బలంగా మారతారు. వారు తమ సంపాదనను అక్కడ ఖర్చు చేయడానికి అవకాశాలన్నీ దుబాయ్ కల్పిస్తుంది. అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోంది.

దుబాయ్ డ్రీమ్స్ ఇప్పుడు భారతీయులను ఆకర్షిస్తున్నాయి. గోల్డెన్ వీసా పొందడానికి చాలా మంది ప్రయత్నిస్తున్న వార్తలు వస్తున్నాయి. గోల్డెన్ వీసా లేనప్పుడే 4300 మంది భారత మిలియనీర్లు దేశం వదలి దుబాయ్ వెళ్ళారని వార్త వచ్చింది. ఈ గోల్డెన్ వీసాతో చాలా మంది దుబాయ్ బాట పట్టవచ్చని కొందరి విశ్లేషణ.

అవినీతి, గుండాల భయం, శాంతిభద్రతలు, చోరీలు ఇలాంటివి లేని చోట ప్రశాంతంగా బతకాలని సంపన్నులు భావించడంలో ఆశ్చర్యం కూడా లేదు.

అబ్దుల్ వాహెద్



# వేడెక్కుతున్న బిహార్ రాజకీయాలు

**బిహారు** శాసనసభకు త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. బహుశా నవంబరులో ఎన్నికలు జరగవచ్చని తెలుస్తోంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఇండియా కూటమి సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మహా గట్‌బంధన్ చక్కా జామ్ (రోడ్డు, రైలు దిగ్బంధం) ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దర్భంగా, మధుబని జిల్లాల్లో విస్తృత ప్రభావం వుంది. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లను దిగ్బంధించి, టైర్లను తగులబెట్టి, నినాదాలు చేస్తూ తీవ్ర నిరసన కార్యక్రమాలను పార్టీల కార్యకర్తలు చేపట్టారు.

బంద్ ప్రభావం నగరంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో, ప్రధాన జాతీయ రహదారులపై కూడా కనిపించిందని, సాధారణ జనజీవనం పూర్తిగా స్తంభించిపోయిందని అక్కడి స్థానిక పాత్రికేయులు తెలియజేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని ప్రైవేట్ పాఠశాలలు కూడా పూర్తిగా మూసివేయబడ్డాయని సమాచారం.

బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను బలహీన, వెనుకబడిన వర్గాల ఓటు హక్కును కబళించే “కుట్ర”గా చాలా మంది విమర్శిస్తున్నారు. ఈ ప్రక్రియకు వ్యతిరేకంగానే ప్రతిపక్షాలు నిరసనకు దిగాయి. ఈ మొత్తం ప్రక్రియను “ఓట్ బందీ” (ఓట్ల రద్దు) ప్రక్రియగా కొందరు అభివర్ణిస్తున్నారు. ఏ విధంగా నోట్ల రద్దుతో ప్రజలను కష్టాల పాలు చేశారో అదేవిధంగా ఓట్లరద్దుతో ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నాలు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇది పేదల ఓటు హక్కును హరించే కుట్రగా నిరసిస్తున్నారు.

ఈ సమస్య కేవలం ఓటింగ్‌కు, పోలింగ్‌కు మాత్రమే సంబంధించింది కాదని పలువురు భావిస్తున్నారు. ఈ ప్రక్రియ ముసుగులో పౌరసత్వాన్ని కూడా సవాలు చేయడం జరుగుతుందన్న భయాలున్నాయి. దీనివల్ల చాలా మంది ప్రభుత్వం ఇచ్చే

సంక్షేమపథకాల ప్రయో జనాలను కోల్పోవచ్చు. ఈ భయాలు గ్రామస్తుల్లో ఉన్నాయని పలువురు వివరిస్తున్నారు. అంతేకాదు, గ్రామస్తుల భయాందోళ నలను కొందరు ఉపయోగించుకుని పత్రాల సేకరణలో సహాయం చేస్తామనే సాకుతో మోసాలకు పాల్పడుతున్నారు. ప్రజలు సైబర్ కేఫ్‌లకు పరుగెత్తుతున్నారు, బ్లాక్ కార్యాలయా లకు పరుగులు తీస్తున్నారు. అసలు ఇంత గందరగోళం ఎందుకు? అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల జాబితా సవరణపై కమిషన్ నిర్ణయం వల్ల బిహార్‌లోని దళితులు, మహాదళితులు, పేదలు భారీగా నష్టపోతారని పలువురు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మైనారిటీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండవచ్చన్న భయాలున్నాయి. పైగా ఎన్నికల కమీషన్ ఈ పనికి బిహారులో ఉపాధ్యాయులను ఉపయో గించుకోవాలని నిర్ణయించింది. బిహార్‌లో విద్యా వ్యవస్థ ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉంది. ఉపాధ్యాయులపై ఒత్తిడి చాలా పెరుగు తోంది. బిహార్ విద్యారంగంపై దీని ప్రభావం చాలా ఉండవచ్చు.

ఉపాధ్యాయులు పత్రాలు సేకరించడానికి ఇంటింటికీ వెళ్ళాలి. ఓటర్లు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. వీటన్నిటి అర్థం ఏమిటి? ప్రభుత్వం అందరినీ గందరగోళంలో పడేసిందని చాలా మంది మండిపడుతున్నారు.

నిజానికి ఇదంతా ప్రభుత్వ ప్రోద్బలంతో చేపట్టిన చర్య అని చాలా మంది భావిస్తున్నారు. ఇది కమిషన్ సొంత నిర్ణయం కాదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం తన ఎజెండా అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది.

గత లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా నుండీ ఓట్లను పొంది ప్రధానమంత్రి అయ్యారు. ఈ జాబితా నిజంగా లోపభూయిష్టంగా ఉంటే లేదా సందేహాస్పదమైనది అయితే మొదట మోడీ రాజీనామా చేయడం అవసరమవు తుందని కొందరు వేలెత్తి చూపిస్తున్నారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ చర్య పరోక్షంగా NRC అమలు చేసే ప్రయత్నమని చాలా మంది అంటున్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్లపై గగ్గోలు చెలరేగింది. చివరకు సుప్రీంకోర్టు జోక్యం తర్వాత బీజేపీకి భారీ స్థాయిలో నిధులు సమకూరడానికి ఈ బాండ్లే కారణమన్న రహస్యం బట్టబయలైంది.

మరోవైపు ఇవియంలపై అనేక అనుమానాలు వస్తున్నాయి. ఎన్నికల సంఘం పక్షపాతంతో వ్యవహరిస్తుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇప్పుడు బిహారులో ఏం చేశారన్నది ఈ నేపథ్యంలో చూడాలి. బిహారు ఎన్నికలు దగ్గరపడుతుండగా ప్రత్యేక ఓటర్ల పరిశీలన కార్యక్రమం మొదలు పెట్టారు. నవంబరులోగా ఎన్నికలు జరప వలసి ఉంది. ఈ ఓటర్ల పరిశీలన కోసం జూన్ 24న ఎన్నికల కమిషన్ పరిశీలన ప్రక్రియకు అవసరమైన పత్రాలేమిటో ప్రకటించింది. ఎన్నికల లోగా ఈ ప్రక్రియ ఎలా పూర్తవుతుంది? ఎందుకంటే తుది ఓటర్ల జాబితా సెప్టెంబరు నెలలో ప్రకటిం చాల్సి ఉంది. పైగా ఈ పత్రాలు చాలా ఉన్నాయి. 2003 జనవరి 1వ తేదీని కొలబద్దగా పెట్టుకున్నామని చెబుతున్నారు. అంటే రెండు దశాబ్దాలుగా ఓటర్ల జాబితా తప్పుల తడకగా కొనసాగుతుందని అర్థమా? అక్రమ వలసదారుల గురించి ప్రస్తావనలు, కఠినమైన గుర్తింపు పత్రాల ప్రక్రియ– ఇదంతా చూస్తే ఎన్నార్సీ ప్రక్రియను ఇలా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజమే అనిపిస్తున్నాయి. ఈ పరిశీలన పేరుతో భారీగా ఓట్లను తొలగించే కార్యక్రమం జరుగుతుంది. దీనివల్ల నష్టపోయేది పేదలే. ఒకసారి మహారాష్ట్రలో ఏం జరిగిందో కూడా గుర్తు చేసుకోవడం అవసరం. అక్కడ లోక్‌సభ, శాసనసభ ఎన్నికల మధ్య కాలంలో, అంటే కేవలం 5 నెలల కాలంలో 39 లక్షల కొత్త ఓటర్లను చేర్చారు.

ఓటర్లుగా నమోదు కావాలంటే ఓటరు తన తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రం సమర్పించాలంట. ఒక వ్యక్తి వయసు నలభై ఏళ్ళుంటే, ఆ వ్యక్తి తల్లిదండ్రుల వయసు ఎంత వుంటుంది? డెబ్బయి, ఎనభై సంవత్సరాల వ్యక్తి బర్త్ సర్టిఫికేటు దొరకడం ఇప్పుడు సాధ్యమా?

ఈ ప్రక్రియపై మండిపడిన మహా గట్‌బంధన్ బిహారులో బంద్ ఇచ్చిన పిలుపుతో బిహారు మూతపడిందని చెప్పాలి. ప్రజలు పెద్ద సంఖ్యలో బందులో పాల్గొన్నారు. స్వయంగా రాహుల్ గాంధీ బిహారు చేరుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో తేజస్వీ యాదవ్ కూడా ఉన్నారు. ఈ రెండు పార్టీలే కాదు ఇంకా అనేక ఇతర పార్టీలు కూడా ఈ బందులో పాల్గొన్నాయి.

ఈ ర్యాలీ వల్ల స్పష్టంగా తెలిసిన మరో విషయమేమిటంటే బిహారులో ఇప్పుడు మహా గట్‌బంధన్ బలం పుంజుకుంది. కాంగ్రెసు మహా గట్‌బంధన్ నుంచి తొలగిపోతుందని, తేజస్వి యాదవ్ ఇందులో ఉండకపోవచ్చని ఇంతకు ముందు వినిపించిన ఊహాగానాల రాజకీయాలకు ఇప్పుడు తెరపడింది. మహా గట్‌బంధన్ పార్టీల్లో సీట్ల సర్దుబాటు కూడా పూర్తయ్యిందన్న వార్తలు వస్తున్నాయి. ఈ ర్యాలీతో మహా గట్‌బంధన్ తన శక్తి

ప్రదర్శించింది. అయితే మజ్లిస్ పార్టీ ఇందులో లేదు. అంటే మజ్లిస్ వేరుగా ఎన్నికల్లో పోటీ చేస్తుంది. మజ్లిస్ ఒంటరిగా బిహారు ఎన్నికల్లో పోటీ చేయడమంటే అర్థమేమిటి? బీహారులో గెలిచే అవకాశాలు మజ్లిస్ కు ఉన్నాయా? మజ్లిస్ పోటీ చేయడం వల్ల ఓడిపోయే ప్రమాదం ఏ పార్టీలకు ఉంది అనేవి ఆలోచించ వలసిన ప్రశ్నలు. కాని ఇందులో ఇంకో మెలిక కూడా ఉంది. మహా గట్‌బంధన్‌లో చేరడానికి సంసిద్ధత ఒవైసీ చూపించారని, కాని ఇంతవరకు మహా గట్‌బంధన్ నుంచి ప్రతిస్పందన లేదని తెలుస్తోంది. కాబట్టి ఒకవేళ ఒవైసీ ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధపడితే, అలా చేసే నైతికహక్కు ఆయనకు పూర్తిగా ఉంది.

మజ్లిస్ ఒంటరిగా పోటీ చేస్తే ఆ పార్టీకి లభించే ఓట్లన్నీ కూడా నిజానికి మహా గట్‌బంధన్ ఓట్లకు కోతపెట్టడమే అవుతుంది. మరోవైపు చిరాగ్ పాశ్వాన్ కూడా బిహారులో అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నట్లు ప్రకటించాడు. లోక్ జనశక్తి పార్టీకి మొత్తం బిహారులో పోటీ చేసే శక్తి లేదు. అయినా అన్ని స్థానాలకు పోటీ చేస్తున్నానని ఆయన చెబుతున్నాడంటే అర్థం ఎన్డీయేలో విభేదాలకు సూచన. ఒకవైపు మహా గట్‌బంధన్ సమైక్యంగా కనిపిస్తుంది. ముఖ్యమంత్రికి సంబంధించి కూడా తేజస్వీ యాదవ్ విషయంలో ఏకాభిప్రాయమే కనిపిస్తోంది. కాని మరోవైపు బిహారులో ఎన్డీయేలో లుకలుకలు బయటపడు తున్నాయి. ఎన్డీయే నుంచి బిహారులో ముఖ్యమంత్రి ముఖం ఎవరన్నది ఇప్పటి వరకు స్పష్టం కాలేదు. నితీష్ కుమార్ పార్టీ అయితే మళ్ళీ నితీష్ కుమార్ ముఖ్యమంత్రి అంటోంది. సుదీర్ఘకాలంగా నితీష్ కుమార్ అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు తన రాజకీయ మైత్రిని మార్చుకుంటూ ముఖ్యమంత్రిగా కొనసాగుతూ వస్తున్నారు. కాని బీజేపీ మాత్రం ఎన్నికల తర్వాతే ముఖ్యమంత్రి ఎవరన్నది తేలుస్తామని అంటోంది. ఈ సారి ఎన్నికల్లో బీజేపీ కన్నా తక్కువ స్థానాలు నితీష్ పార్టీకి వస్తే ఆయన ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లేదు. ఈసారి ఎన్నికల్లో కూడా మహా గట్‌బంధన్ వైపు వెళ్ళే అవకాశాలు ఆయనకు లేవు. ఇప్పుడు ఆయన్ను ఎవ్వరు నమ్మడానికి సిద్ధంగా లేరు. ఒకవైపు బిహారులో ఈ రాజకీయ సమీకరణాలుంటే మరోవైపు ఓటర్ లిస్టు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదట తల్లిదండ్రుల బర్త్ సర్టిఫికేటు కూడా చూపించాలన్నారు. దీనిపై గగ్గోలు చెలరేగిన తర్వాత ఈ పత్రాలు అవసరం లేదని, ఆధార్ కార్డు ఉంటే చాలని చెప్పారు. ఇప్పుడు ఈ ఓటర్ వెరిఫికేషన్ ఎందుకంటే, విదేశీయుల ఓట్లను గుర్తించి తొలగించడానికి అంటున్నారు. బిహారులో నేపాల్ బోర్డర్ ఉంది కాబట్టి అక్కడి నుంచి వచ్చిన వారు ఉండవచ్చు. మరో కారణం చొరబాటుదారు లను గుర్తించడం అన్నారు. ఝార్ఖండ్ ఎన్నికలప్పుడు కూడా ఈ గగ్గోలు చేశారు. కాని బిహారులోకి బంగ్లాదేశీ చొరబాటు దారులు రావాలంటే బెంగాల్ దాటి రావాలి. పైగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌ను దాటుకుని రావాలి. బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారులు ఇలా వచ్చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోంది? హఠాత్తుగా ఎన్నికల సమయంలోనే బంగ్లాదేశీ చొరబాటుదారులనే సమస్య ఎందుకు ముందుకు వస్తోంది? మరో ప్రశ్న ఏమంటే, బిహారులో బంగ్లాదేశీ చొరబాటు దారులను గుర్తించే పని ఎన్నికల కమిషన్ తన భుజాలపైన ఎందుకు వేసుకుంది. బిహారు ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామ్య పార్టీ కాబట్టి ఇప్పటి వరకు బిహారులో ఈ విదేశీ చొరబాటు దారులని గుర్తించే కార్యక్రమం ఎందుకు జరగలేదు? ఇప్పుడు ఎన్నికలు సమీపించినప్పుడు ఈ తతంగం మొదలు పెట్టడం ద్వారా ముఖ్యంగా ముస్లిముల ఓట్లను జాబితా నుంచి తొలగిస్తారనే ఆరోపణలు బలపడుతున్నాయి. ఇలా చేస్తే బీజేపీకి లాభిస్తుంది. ఇప్పుడు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది.

మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య పెరగడంపై కూడా ప్రతిపక్షాలు చాలా ఘాటుగా ప్రతిస్పందించాయి. ఇప్పుడు బిహారు విషయం లోను అంతే ఘాటుగా ప్రతిస్పందిస్తున్నాయి.

సుప్రీంకోర్టు ఈ విషయంలో ఏం చేస్తుందో చూడాలి. ఈ ప్రక్రియను సుప్రీంకోర్టు ఆపేస్తే అది ఎన్నికల కమిషన్ నిర్ణయాల విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. బిహారు ఓటర్ల జాబితా నుంచి ఓటర్లను తొలగించడం జరిగితే ఆందోళనలు ఉధృతం కావచ్చు. ఈ ప్రక్రియను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తారా? వేచి చూడాలి. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
గీటురాయి
వారపత్రిక

7/1

# కలిసి వచ్చిన కూడలి

ఎస్.ఎమ్. మలిక్

## మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)

**ప్రప్రథమంగా ఇస్లామ్ స్వీకరించిన** ఎనమండుగురు సౌభాగ్య వంతులలో ఒకరు. ఇహంలోనే పరంలో లభించే సాఫల్యం శుభ వార్త అందుకున్న పది మంది అదృష్ట వంతుల్లో ఒకరు. మహనీయ ఉమర్ ఫారూక్(ర)తరువాత ఖలీఫాను ఎన్ను కునేందుకు నియమితులయిన ఆరుగురు సలహామండలి సభ్యుల్లో ఒకరు. ప్రవక్త మహనీయుని కాలంలోనే ధార్మిక నిర్ణయాలు చేసే పండితులు, జ్ఞానులలో ఒకరు.

అజ్ఞాన కాలంలో ఈయన పేరు అబ్దు అమ్ర్, ఇస్లామ్ స్వీకరించిన తరువాత ప్రవక్తశ్రీ(స) పేరు మార్చి అబ్దుర్రహ్మాన్ అని పెట్టారు. సహచర మాన్యుల పేర్లు, అవసరమయితే ప్రవక్త మహనీయులు(స) సూచించడమో మార్చడమో చేసే వారు. హదీసు గ్రంథం బుఖారీలో బద్ర్ పోరాటంలో పాల్గొన్న వారి పేర్ల జాబితాలో ఆయన పేరు, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అజ్జుహ్రీ అని ఉంది. ఆయన పుట్టుక రీత్యా ప్రవక్తశ్రీ(స) కన్నా 13 ఏండ్లు చిన్నవారు.

### ఇస్లామ్ స్వీకృతి

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర)తో ఆయనకు స్నేహపూర్వక సంబంధాలుండేవి. మక్కాలోని గౌరవనీయులు, మేధావులు అనబడే వారు కొందరు ప్రతి రోజూ మహనీయ అబూబక్ర్(ర) ఇంట కూర్చుని విభిన్న విషయాలపై చర్చలు జరిపేవారు. మహనీయ అబ్దుర్రహ్మాన్ కూడా ఆ కూడలిలోని ఒక వ్యక్తి. ఆ విధంగా తొల్దొలి రోజుల్లోనే ఇస్లామ్ కాంతివల్ల ఉజ్వల మానమయిన మహనీయ అబూ బక్ర్ (ర), ఆ కూడలిలోని వారికి ఆ జీవనదాయక సందేశం అందజేసే ఉంటారు.

ఆయన ద్వారా ఇస్లామ్ స్వీకరించిన తొలి అయిదుగురి జాబితాలో మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ పేరు కూడా కనిపిస్తుంది. ఈ అయిదుగురు ఆనాటి సమాజంలోని నవనీతం అని చెప్పవచ్చు. వారు ధార్మిక సేవలోనూ ప్రముఖ మయిన వారుగా రుజువయ్యారు. దైవం దృష్టిలో వారి సేవల స్వీకారానికి ఆనవాలుగా ఇహంలోనే వారికి పరలోక సాఫ ల్యాన్నీ వినిపించడం జరిగింది.

## హిజ్రత్

గోప్యంగా సాగిన ఇస్లామ్ పిలుపు కొన్నేళ్ళ పిదప బాహాటంగా మొదలయింది, అజ్ఞానం, మూఢత్వం విమర్శించబడ్డాయి. బహుదైవారాధన, తిరస్కారాలను శాస్త్రీయంగా హేతుబద్ధంగా ఇవి తప్పయినవి అని విశ్లేషించి మరీ బోధించడం జరిగింది. గత చరిత్ర ఆధారంగా మానవ సాఫల్య వైఫల్యాలకు మూలం ఏమిటో విడమర్చి ఉపదేశించటం జరిగింది. సత్యం, సౌశీల్యం, సద్వర్తనం వల్ల ప్రాప్తమయ్యే ఇహపర ప్రయోజ నాలను స్పష్టంగా మక్కా బహుదైవారాధకుల సమక్షంలో పెట్టడం జరిగింది.

ఇంత వివరంగా సందేశం అందజేసినా కొందరు శుభాత్ములు తప్ప వీటికి సకారాత్మకంగా స్పందించిన వారు లేరు మక్కా పురజనుల్లో. ఫలితంగా మక్కా బహుదైవారాధకులు ఆనాటి నవ ముస్లిముల పైన ఎనలేని దౌర్జన్యాలకు హింసలకు పాల్పడ్డారు. వాటిని సహించడం మరీ దుర్భరమయినప్పుడు వీలున్న వారు సముద్రానికి ఆవల అబీసీనియాకు వలస వెళ్ళేందుకు అనుమతి నిచ్చారు ప్రవక్త(స). దైవ దౌత్యం ప్రాప్తమయిన 5వ సంవత్సరం ముస్లిములు మొదటి విడతగా పదకొండు మంది పురుషులు, నలుగురు మహిళలు కొత్త ప్రదేశానికి ఇల్లూవాకిలి వదలి వలస వెళ్ళారు. ఈ బృందంలో మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కూడా ఉన్నారు.

## రెండవ హిజ్రత్

ఆ తరువాత ప్రవక్త(స) మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు రెండవ హిజ్రత్ మదీనాకు చేశారు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర). ఆయన మదీనాలో సఅద్ బిన్ రబీ' ఇంట ఆతిథ్యం స్వీకరించారు. ప్రవక్త మహనీయులు(స) అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర) సోదరత్వం సఅద్ బిన్ రబీ' బిన్ అమ్ర్ ఖజ్రజీ(ర)తో చేయించారు. సఅద్ అత్యంత సంప న్నులు. ఆయన అబ్దుర్రహ్మాన్‌తో, "అన్నయ్యా! అందరికీ తెలుసు నేను ధనవంతుణ్ణి. నా సంపద మొత్తాన్ని రెండు విభాగాలుగా విభజిస్తాను. అలాగే నాకు ఇద్దరు భార్యలు, మీరు యిద్దరినీ చూడండి, మీకు నచ్చిన ఆవిడకు నేను విడాకులు ఇస్తాను, ఆ తరువాత మీరు ఆవిడను వివాహం చేసుకోగలరు" అన్నారు. దానికి మహనీయ అబ్దుర్రహ్మాన్(ర), "దైవం మీ సంపదలో, మీ కుటుంబంలో శుభం కలుగజేయు గాక! సోదరా, నాకు ఇవన్నీ ఏమీ అవసరం లేదు. నాకు మీరు బజారు దారి చూపండి, చాలు" అన్నారు.

ఈ ఉదంతం ద్వారా అమూల్యమయిన విషయాలు బోధపడతాయి. ఒక వైపున మహనీయ సఅద్ బిన్ రబీ'(ర) లోని త్యాగ నిరతి, ప్రవక్త(స) ఆదేశం పట్ల ఆదరణ, గౌరవం దర్శనమిస్తాయి, ఇలాంటి ఉదాహరణలు స్వయం ముస్లిమ్ సముదాయంలోనూ కానరావు, మానవ చరిత్రలోనయితే వెదకడమే అనవసరం. మరోవైపున మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర)లోని సంతుష్టి, సంతృప్తి, ఆత్మాభిమానం, ఆత్మ విశ్వాసం, స్వయంకృషి ద్వారా నిలదొక్కుకునే దృఢ సంకల్పం దర్శనమిస్తాయి. మరుసటి రోజు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ తన అన్సారీ సోదరుణ్ణి బజారు గురించి వాకబు చేసి అటు వైపునకు బయలుదేరుతారు.

## మదీనాలో జీవితం

ఒక చోట నెయ్యి మొదలయినవి కొని బజారులో కూర్చుని అమ్ముకుంటారు ఆయన. ఆ తరువాతి దినం కూడా అదే చేస్తారు. ఆ వ్యాపారం కొన్నాళ్ళు సాగించారు. భోజనాది ఖర్చు లకు పోగా కొంత రొక్కం మిగలగా ఒక అన్సారీ మహిళను పెళ్ళి చేసుకుంటారు. ఒక రోజు దైవ ప్రవక్త సన్నిధిలో ఆయన వెళ్ళగా ఆయన బట్టల పైన పసుపు పచ్చ రంగు అగుపి స్తుంది. అది చూసి ప్రవక్త(స) అడుగుతారు, "పెళ్ళి చేసు కున్నావా?" అని. అవునని సమాధానం ఇచ్చారు. మళ్ళీ అడిగారు, "ఎవరినీ" అని. "ఒక అన్సారీ మహిళను" అని చెప్పారు. మహ్ర్ ఎంత అని అడిగిన దానికి "ఒక బంగారు గుండీ" అని అంటారు. ఆ తరువాత ప్రవక్త మహనీ యులు(స) "వలీమా తప్పక చెయ్యి, ఒక్క మేక జిబ్హ్ చేసినా సరే" అన్నారు.

మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ క్రమేణా తన వ్యాపారాన్ని బాగా వృద్ధి పరచి మంచి సంపాదనా పరులుగా పేరు గడించారు. ధర్మోన్నతియే లక్ష్యంగా మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, బద్ర్, ఉహుద్, కందకం, ఇంకా ఇతర పోరాటాల్లో ఎంతో ఉద్వేగం ఉత్సాహంతో పాల్గొన్నారు. ప్రతి సందర్భం లోనూ ఎంతో స్థయిర్యం, శౌర్యం ప్రదర్శించారు. మొదట బద్ర్ మైదానంలో పోరాట సమయంలో ఆయన మదీనా వచ్చి పద్దెనిమిది నెలలే అయింది. ముహాజిరులు అందరూ చాలా నికృష్ట స్థితిలో ఉన్నారు. నిజానికి మక్కాలోని ప్రతి ఇంట ఒకరిద్దరు మటుకే ఇస్లామ్ స్వీకరించారు. వారంతా ఎలాగో దాక్కుంటూ దాక్కుంటూ తల్లీ దండ్రుల్ని, భార్యా పిల్లల్ని వదలి మదీనా వచ్చినవారు.

హిజ్రీ 2వ సంవత్సరం, రమజాన్ నెలలో జరిగిన ఈ పోరులో తండ్రీ కొడుకుతో, కొడుకు బాబాయితో, సోదరుడు సోదరునితో ఢీకొనవలసి వచ్చింది, వాతావరణం అనుచితంగా, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయి. యూదు తెగల విరోధం, స్వయాన మదీనా నగరంలో కపటులు, బహు దైవారాధకులు బలవత్తరంగా ముస్లిములను అంతం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పైగా చుట్టు ప్రక్కల అనేక తెగలు దేవుని ఏకత్వ సందేశాన్ని ఇస్లామ్‌ను తుద ముట్టించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దివ్యకుర్ఆన్ ఈ పరిస్థితిని ఈ విధంగా చిత్రిస్తుంది,

వారి పరిస్థితి, చూస్తూ చూస్తూ మృత్యువు వైపునకు తోలబడుతున్నట్లు అనిపిస్తుంది. (అల్ అన్ఫాల్ 8 : 6)

ఈ పరిస్థితుల్లో మహనీయ అబ్దుర్రహ్మాన్ తన ప్రాణాలను గుప్పెట్లో పట్టుకుని దైవమార్గంలో అర్పించడానికి సంతోషంగా బయలుదేరారు. ఇంకా ఇతరుల్ని సయితం ప్రోత్సహిస్తూ ఉన్నారు. స్వయంగా ఆయన నోట వినాలి ఆ నాటి విషయాన్ని, 'నేను బద్ర్ నాడు పంక్తిలో ఉన్నాను. యుద్ధం ఘోరంగా జరుగుతోంది. నా ప్రక్కన ఇరువైపులా ఇద్దరు నవ యువకులు ఉన్నారు. వారి పట్ల నాకు తృప్తి కలగలేదు. అంతలోనే వారిలో ఒకరు నాతో మెల్లగా అడిగాడు, "బాబాయి, అబూ జహ్లు ఎవరో కాస్త చూపండి" అని. నేనడిగాను, ఎందుకు అని. అతను, "నేను దైవంతో శపథం చేసుకున్నాను, అతన్ని సంహరించనయినా సంహరిస్తాను, లేదా ఆ దారిలో స్వయంగా నేనే హతమవుతాను"అని. ఆ తరువాత మరో యువకుడు కూడా ఇదే విషయాన్ని మెల్లగా అడిగాడు. ఈ సంభాషణ వల్ల నాకు ఆనందం కలిగింది, నేను ఇటువంటి యువకుల మధ్య ఉన్నానని. ఆ పైన నేను అబూ జహ్లుని చూపెట్టాను. అకస్మాత్తుగా వారిరువురూ అతని పైన లంఘించి అతన్ని తుద ముట్టించారు. ఈ యువకులు, మఆజ్, మఊజ్ సోదరులు, అఫ్రా తనయులు.

## మరో సంఘటన

ఇదే యుద్ధంలో మరో సంఘటనా జరిగింది. అది ఉమయ్య బిన్ ఖలఫ్(ర), ఖురైష్ నాయకునికి సంబంధించినది. బద్ర్ నాడు అతని సంహారానికి మూలం మహనీయులు బిలాల్ (ర). మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ తాను వ్యాపారం సందర్భంలో అతనితో చేసుకున్న ఒడంబడిక కారణంగా అతన్ని కాపాడాలని కోరుకున్నారు. ఆ గాథ ఆయన నోట వినాలి :

అజ్ఞాన కాలంలో ఉమయ్య బిన్ ఖలఫ్ నా మిత్రుడు. ఇస్లామ్ ఆవిర్భావం తరువాత నేను ముస్లిమ్‌నయ్యాను, అతను మారలేదు. బద్ర్ పోరాటంలో నేను ఎందరినో తిరస్కారుల్ని హతమార్చాను. కాని నా ఒడంబడిక మూలంగా అతన్ని కాపాడటం నా ధర్మం. నేను సంహరించిన తిరస్కారుల కవచాలు తీసి వాటిని భద్రపరచాలని వెడుతుండగా అతను తన కొడుకు అలీ చెయ్యి పట్టుకుని వెడుతూ కనిపించాడు. నన్ను సంబోధించి "నీ దృష్టిలో నా విలువ ఈ కవచాల కన్నా అధికమా" అన్నాడు. నేను వెంటనే ఆ కవచాలు అటు పడేసి అతన్ని ఒక చేత్తో అతని కొడుకును మరో చేత్తో పట్టుకుని వెడుతూ ఉండగా మహనీయ బిలాల్ దృష్టి అతని మీద పడి ఆయన బిగ్గరగా అరిచారు, "ముస్లిముల్లారా! ఇదో తిరస్కారులకు అండగా నిలిచే ఉమయ్య బిన్ ఖలఫ్ సురక్షితంగా వెడుతున్నాడు" అని. అంతే, చాలామంది గుమికూడారు. వారిలో ఎవరో అతని కొడుకు పైన కరవాలంతో దాడి చేశారు. ఆ అబ్బాయి నేల కొరిగాడు. అది చూసి ఉమయ్య బిగ్గరగా కేక వేశాడు. అతను స్థూలకాయుడు,నా వైపు దీనంగా చూశాడు, నన్ను కాపాడవా! అని. నేను అతన్ని కూర్చో అని చెప్పాను, అతను కూర్చోగానే నేను అతన్ని కాపాడేందుకు అతని పైన పూర్తిగా వంగిపోయాను. అయినా జనం మానుకోలేదు. నా క్రిందుగా కరవాలాలు జొనిపారు. అతనూ హతమయ్యాడు, నా కాలు కూడా బాగా గాయపడింది.

దీని ఉల్లేఖనకర్త ప్రకారం, ఆయన తరచూ మహనీయ బిలాల్(ర)ని గురించి ఇలా పలికేవారు, "దైవం బిలాల్‌ని కరుణించాలి, నేను ప్రోగు చేసిన కవచాలూ పోయాయి, నాకు గాయమూ అయింది, నేను పట్టుకున్న ఖైదీనీ విడిపించుకున్నారు. " ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**డా. ముహమ్మద్ హసన్, సహాయ ఆచార్యులు**

"పాలకుడు మూర్ఖుడు అయితే ప్రజల జీవితం ప్రమాదంలో పడుతుంది" అని చెప్పడానికి ప్రపంచ చరిత్రలో ఎన్నో సంఘటనలను ప్రస్తావించవచ్చును. పాలకుల దుశ్చర్యల బారినపడి ప్రజలు పడ్డ కష్టాల గూర్చి పెద్ద సిద్ధాంత గ్రంథాలనే వ్రాయవచ్చు. దీనికి ఉదాహరణగా ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు శ్వేతసౌధంలో విందు ఇవ్వడం, అనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం అధికారికంగా సదరు ట్రంప్ గారికి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేయడం.

ఇది జరిగి ఇరవై నాలుగు గంటలు గడవకముందే చంచల మనస్తత్వం, దూకుడు స్వభావం కల్గిన ట్రంప్ ఈరాన్‌లోని మూడు అణ్వస్త్ర స్థావరాలపై (నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్) గత నెల (22-06-2025) మొదటిసారిగా తయారుచేసి పెట్టుకున్న బంకర్ బ్లస్టర్ బాంబులను ప్రయోగించి ఈరాన్- ఇస్రాయీల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి తన ప్రమేయం లేకున్నా సినిమాలలో తళుక్కున మెరిసే అతిథి పాత్ర వలె వచ్చి ఈరాన్‌లో విధ్వంస రచన చేసి ప్రపంచ రాజకీయాలలో ఓ చెడు ముద్రను వేసుకున్నాడు. పోనీ ఈరాన్- ఇస్రాయీల్‌కు మధ్య భౌగోళికమైన సరిహద్దులు ఉన్నాయా అంటే అవీ లేవు. కేవలం పాలస్తీనాలో ఇస్రాయీల్ పాల్పడుతున్న నర మేధాన్ని ఈరాన్ ప్రశ్నించడం మరియు హమాస్, హుతి, హిజ్బుల్లా తిరుగు బాటుదారులకు సహాయం చేస్తుందన్న నెపంతో ఇస్రాయీల్ - ఈరాన్‌ను బలవంతంగా యుద్ధంలోకి లాగింది.

దీని ఫలితాన్ని బహుశా ఇస్రాయిల్ పాలకులు గాని, దానికి వంతపాడే అమెరికా అధికార గణం గానీ సరిగ్గా అంచనా వేయలేకపోయాయి. గత ఇరవై ఒక్క నెలలుగా ఇస్రాయిల్ గాజాలో ఎంతటి నరమేధం సృష్టిస్తుందో ప్రపంచం మొత్తం రెండు కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తూనే ఉంది. పాలస్తీనాలో ఇప్పటి వరకు (18 జూన్ – 2025 నాటికి) 57,800 మంది చనిపోయారని నివేదికలు తెలియజేస్తున్నాయ్. వీరిలో అత్యధికంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు. వీరెవరూ ఇస్రాయిల్ పైకి యుద్ధానికి నేరుగా వెళ్ళినవారు కాదు. అలా అని ఈ ఇరవై ఒక్క నెలల యుద్ధ కాలంలో "హమాస్" పూర్తిగా తుడిచి పెట్టుకుని పోయిందా అంటే సమాధానం లేని ప్రశ్న. అంటే ఇస్రాయిల్ హమాస్‌పై యుద్ధం ప్రకటించి ఏం సాధించింది? గాజా ప్రాంతం మొత్తాన్ని నేల మట్టం చేసింది. అక్కడి ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇది చాలదన్నట్లుగా ఈరాన్ పైకి ఆలోచన వచ్చిందే తడవుగా (13 జూన్ 2025 న) దాడికి ఆదేశాలివ్వడం నెతన్యాహు చేసిన రెండో వెకిలి చేష్ట. నెతన్యాహు మరియు అగ్రరాజ్యం రెండూ ఈరాన్‌ను తక్కువగా అంచనా వేశాయి. ఈరాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే త్వరగా లొంగి పోతుంది, అక్కడి పాలకులను కాళ్ళ బేరానికి రప్పించి అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టం (NPT) మీద సంతకం చేయించుకోవాలని చూశారు. కానీ వారు అనుకున్నట్లుగా జరుగ లేదు. ఫలితంగా రెండు వైపులా పది రోజుల పాటు (23-06-2025 వరకు) జరిగిన యుద్ధంలో ఈరాన్ వైపు సుమారు ఎనిమిది వందల మంది, ఇస్రాయిల్ వైపు వందమంది పౌరులు మరణించినట్లు సమాచారం. (ఇది ఎక్కువగా ఉండొచ్చు కూడా) ఇక భౌతికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడం చాలా కష్టమైన అంశం. గతంలో ఇస్రాయిల్ అరబ్ దేశాలతో జరిగిన యుద్ధంలో (1967) కేవలం వారం రోజుల్లోనే గెలిచింది. మళ్ళీ ఈరాన్ పై అలాగే గెలుస్తామని అనుకోవడం ఇస్రాయిల్ చేసిన అతి పెద్ద పొరపాటు. ఈ పది రోజుల యుద్ధంలో ఇస్రాయిల్ రక్షణ కవచం (ఐరన్ డోమ్) ఈరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిసైళ్ళ ముందు తలొంచాల్సి వచ్చింది. ఫలితంగా ఈ 77 సంవత్సరాల కాలంలో ఇస్రాయిల్‌కు జరిగిన నష్టం ఈరాన్‌తో ఈ పది రోజుల యుద్ధంలో జరిగింది. ఇస్రాయిల్ ప్రధాని నెతన్యాహు అమెరికాను ముగ్గులోకి దించి ఈరాన్‌లోని అణ్వస్త్ర స్థావరాలను ధ్వంసం చేసి సంతృప్తి పడొచ్చు. కానీ దాడికి ముందే (22-06-2025) ఆయా అణ్వస్త్ర స్థావరాలను "శుద్ధి చేసిన యురేనియంను" ఈరాన్ తరలించిందన్నది ఓ వార్తా కథనం. వెరసి అదే జరిగినా ఈరాన్ అంతర్జాతీయంగా ఈ యుద్ధం ద్వారా ప్రపంచానికి ఓ గట్టి హెచ్చరికను ఇవ్వగల్గింది. ఈరాన్ జోలికి ఎవరు వచ్చినా అంత తేలిగ్గా వదిలి పెట్టం అనేది ఆ హెచ్చరిక సారాంశం. ఇక కొసమెరుపు ఏంటంటే ఇస్రాయిల్ వద్ద అణ్వస్త్రాలు వున్నా ప్రశ్నించని అమెరికా యుద్ధంలోకి అనవసరంగా ప్రవేశించి రగులుతున్న మంటలకు తోడు మరికాస్త పెట్రోల్ పోసినట్లుగా అమెరికా చేసిన చారిత్రక తప్పిదం. తన సైనిక స్థావరాలపై ఈరాన్ విరుచుకు పడటంతో జరుగబోయే నష్టాన్ని ఊహించి తప్పనిసరి పరిస్థితులలో, అటు అమెరికాలోను ట్రంప్‌కి వ్యతిరేకంగా అక్రమ వలసదారుల నిరసనలు, ఇటు యుద్ధ వ్యతిరేక నిరసనలు జరగడంతో ఇస్రాయిల్‌ను బలవంతంగా కాల్పుల విరమణకు ఒప్పించారు. ఈ రెండు దేశాల మధ్య "ఖతర్" మధ్యవర్తిత్వం వహించిందనేది బహిరంగ రహస్యం. ఈ వ్యవహారంలో ట్రంప్ మళ్ళీ ఇస్రాయిల్ ఈరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనని చెప్పి అంతర్జాతీయ మీడియాకు ఓ వార్తా సాధనంగా మారాడు కూడా. ఆపరేషన్ సింధూర్ విషయంలో కూడా అనవసరంగా తలదూర్చి తానే రెండు అణ్వస్త్ర దేశాల మధ్య కాల్పుల విరమణ కుదిర్చానని పదేపదే లీకులు ఇచ్చి మన నాయకత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేసే ప్రయత్నం చేయడం గమనార్హం. మరి ఇప్పుడు పాకిస్తాన్ అధికార గణం మళ్ళీ ట్రంప్‌ను నెత్తిన పెట్టుకొని "నోబెల్ శాంతి బహుమతి" ఇవ్వాలని మళ్ళీ సిఫార్సు చేస్తుందేమో చూడాలి. ఇది చాలదన్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ పేరును తన మిత్ర బృందంతో పాటుగా అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డి కార్టర్ నార్వేలోని నోబెల్ కమిటికి లేఖ పంపించడం గమనార్హం. అలాగే ఇస్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని నోబెల్ కమిటీకి రాసిన సిఫార్సు లేఖను ట్రంప్‌కు ఇటీవల అందజేశాడు.

## ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి ఎప్పుడివ్వాలంటే...

గతంలో అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన బరాక్ ఒబామాకు 2009వ సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రజల మధ్య శాంతి సుహృద్భావ వాతావరణం, అలాగే దేశాల మధ్య సమన్వయం కుదిర్చినందుకు గాను "శాంతి బహుమతి" ప్రకటించగా అనేక స్వచ్ఛంద సంఘాలు, కొన్ని దేశాల నుండి కూడా విమర్శలు అప్పట్లో వినిపించాయి. మరి అలాంటిది నేడు డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో తన హయాంలో

ఎలాంటి యుద్ధాలు, యుద్ధ వాతావరణం ఉండదని చెప్పి వ్యూహాత్మకంగానే ఇజ్రాయిల్‌తో పాలస్తీనాలోని "హమాస్" తిరుగుబాటుదారుల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటింపచేసి, ఎన్నికలు పూర్తి అయిన మరుక్షణం నుండే తిరిగి గాజాలో ఇజ్రాయిల్ సైన్యం మారణహోమం సృష్టిస్తుంటే ట్రంప్ మీనమేషాలు లెక్కించుకుంటూ, గోళ్ళుగిల్లుకుంటూ వేడుక చూడటం దేనికి సంకేతం? అక్కడ 24 గంటల్లో చిన్న పిల్లలకు ఆహారం దొరకకపోతే సుమారు పద్నాలుగు వేలకు పైగా చిన్న పిల్లలు చనిపోతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు గాజాలో సహాయ చర్యల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సంఘాలు చెప్పినా వినకుండా, నేటికి కూడా ప్రతిరోజు సుమారుగా 60 మందికి పైగా సైన్యం జరుపుతున్న దాడిలో చనిపోతూనే ఉన్నారు. మరి ఇవన్నీ అమెరికా అధ్యక్షుడికి తెలియకుండా జరుగుతున్నట్లేనా? దీనికి తక్షణం పెద్దన్నగా ఇజ్రాయిల్‌ను ఒప్పించి శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి గాజా / పాలస్తీనా పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయాలి. అలాగే ఐక్యరాజ్య సమితి (UNO) 1948లో చేసిన ఇజ్రాయిల్ ఏర్పాటుతో పాలస్తీనాకు కేటాయించిన భూ భాగాన్ని అగ్రరాజ్యం (అమెరికా) ఇజ్రాయిల్, యూరోపియన్ యూనియన్ దేశాలు పాలస్తీనా ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చొరవ తీసుకొని ముందడుగు వేయాలి. తద్వారా పశ్చిమాసియాలో నిత్యం రగిలే రాచపుండు మాదిరిగా ఉన్న పాలస్తీనా సమస్యకు శాశ్వతంగా తెరపడుతుంది.

**ఇక రెండవది:** ఒక వైపు నాటో సభ్య దేశాలు (NATO Countries), అలాగే యూరోపియన్ యూనియన్ దేశాలతో ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ అగ్రరాజ్యం పరోక్షంగా ఉక్రెయిన్ – రష్యా మధ్య యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ వుంది. గత రెండున్నర సంవత్సరాలుగా రెండు దేశాల మధ్య యుద్ధం జరగడానికి పరోక్ష కారణం అగ్రరాజ్యమే. దీనినంతటిని ప్రపంచం గమనిస్తూనే ఉంది. ఈ యుద్ధాన్ని కూడా వెంటనే విరమించేలా డోనాల్డ్ ట్రంప్ క్రియాశీలక పాత్ర పోషించాలి. అలాగే తక్షణమే ఉక్రెయిన్ దేశానికి నాటో సభ్య దేశాలతో పాటు అమెరికా కూడా ఆయుధాల సరఫరా నిలిపివేస్తే యుద్ధం నిలిచిపోతుంది. ఈ విషయంలో కూడా అగ్రరాజ్య అధ్యక్షుడిగా ట్రంప్ చొరవ తీసుకొని ఆయుధాల సరఫరా నిలిపివేయాలి.

**మూడవ అంశం:** అగ్రరాజ్యానికి (అమెరికా) ఉగ్రవాద నిర్మూలనే పెద్ద ఎజెండా అయినప్పుడు మనదేశంతో స్నేహం, పొరుగు దేశం (పాకిస్తాన్)తో ఒప్పందాలు ఇలాంటి ద్వంద్వ నీతిని అగ్రరాజ్యం అవలంబించడం విడ్డూరం. ఇది యావత్ ప్రపంచంలోని మేధావులను తొలుస్తున్న ప్రశ్న. అలాగే ఇజ్రాయిల్ యెమన్ దేశంలోనూ, సిరియాలోను చేస్తున్న దాడులు వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ అగ్రరాజ్య అధ్యక్షుడిగా, ప్రపంచ పెద్దన్నగా పిలువబడే డోనాల్డ్ ట్రంప్ చేయగలడా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న! ఏది ఏమైనా ట్రంప్‌ను ఏరికోరి తెచ్చుకున్న అమెరికా ప్రజలకు, మిగిలిన మూడున్నర సంవత్సరాలు అమెరికా సమాజానికి, ప్రపంచానికి ఎలాంటి సందేశం ఇస్తాడో చూడాలి. మొత్తానికి డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడం అనేది ఈ శతాబ్దపు జోక్ మాత్రమే !? ✤


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

## Bank Details

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

## రిపోర్టు




# "విలువలతో కూడిన జర్నలిజానికి నాంది పలకండి!"

### - జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ మీడియా కార్యదర్శి జనాబ్ సల్మాన్ అహ్మద్.

### "ఐడియల్ జర్నలిస్ట్ ఫోరం, ఏపి" ఆవిర్భావం

జమాఆతె ఇస్లామీ హింద్, ఆంధ్రప్రదేశ్ మీడియా విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో 06-07-2025, ఆదివారం స్థానిక దర్సెగాహె ఇస్లామీ పాఠశాలలో రాష్ట్ర స్థాయి 'జర్నలిస్ట్ మీట్' జరిగింది. జనాబ్ హమీద్ పాషా ఖుర్ఆన్ పాఠంతో ప్రారంభమైన ఈ సమావేశానికి జమాఆతె ఇస్లామీ హింద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ అధ్యక్షత వహించారు. జమాఆతె ఇస్లామీ హింద్ రాష్ట్ర మీడియా కార్యదర్శి పాత్రికేయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జమాఆతె ఇస్లామీ హింద్ జాతీయ మీడియా కార్యదర్శి జనాబ్ సల్మాన్ అహ్మద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జమాఅతె ఇస్లామీ హింద్ జర్నలిజం సంస్కరణల్లో భాగంగా ముందడుగేసి, జర్నలిస్టు మిత్రుల సమావేశం ఏర్పాటు చేయడం హర్షణీయమని అభినందించారు. ఈ సంధర్భంగా జనాబ్ సల్మాన్ మాట్లాడుతూ విలువలు అడుగంటి పోతున్న ఈ తరుణంలో మంచి జర్నలిస్టుగా, న్యాయం కోసం నిలబడే ధ్వజవాహకులుగా జర్నలిస్టులు స్థిరంగా నిలబడటం కష్టమైనా అసాధ్యం కాదన్నారు. చిన్న అబద్ధంతో చిత్రీకరించిన వార్తల వల్ల ఎంతో నష్టం జరిగి మత వైషమ్యాలకు దారి తీసిన దేశవ్యాప్త పలు సంఘటనలను ఆయన సోదాహరించారు. నిజమైన వార్తలు అందివ్వడం దేశ సేవలో, సమాజ సేవలో భాగమే అన్నారు. జమాఆతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ రఫీఖ్ మాట్లాడుతూ మంచి జర్నలిస్టు వార్తల్లోని అసలైన నేపథ్యం అన్వేషిస్తారని, అతనిలో జవాబుదారి తనం, వృత్తి పట్ల అంకిత భావం ఉంటుందన్నారు. వ్యక్తి ఏ వృత్తిలో ఉన్నా అతనిలో దైవభీతి ఉంటే సమాజం పట్ల బాధ్యతతో మెలుగుతాడని, ఉత్తమ జర్నలిస్టులో ఈ లక్షణం ప్రధానంగా ఉండాలన్నారు.

సీనియర్ జర్నలిస్టు షఫీ అహ్మద్ 'మీడియా – జర్నలిస్టు పాత్ర' అనే అంశంపై మాట్లాడుతూ ఓ జర్నలిస్టులోని వృత్తి నిబద్ధత అతని గౌరవాన్ని ఇనుమడింపజేస్తుందని, సత్తా ఉన్న జర్నలిస్టు నేత్రం సమాజంలోని ఏ రంగాన్నైనా ముందే పసిగట్టగలుగుతుందన్నారు. రాజకీయ ప్రక్షాళనకు, సమాజ రుగ్మతలు రూపుమాపుటలో పాత్రికేయులు కీలక పాత్ర వహించాలని జమాఅతె ఇస్లామీ హింద్ నేటి సమావేశానికి ఇచ్చిన 'న్యాయానికి ధ్వజవాహకులుగా నిలబడండి' అన్న నినాదం నేటి జర్నలిజానికి శిరోధార్యం అన్నారు. ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ జర్నలిజంలోని వన్నెలను వివరిస్తూ దిశానిర్దేశం చేశారు. మంచి ఉద్దేశంతో సమావేశమైన జర్నలిస్టులు సంఘటితంగా అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని, జమాఅతె ఇస్లామీ హింద్ నాయకత్వం జర్నలిస్టులకు ఎంతో అవసరం అన్నారు. నశీర్ తన రచనలు 'చరితార్థులు', ఇతర గ్రంథాలను జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి సల్మాన్ గారికి బహూకరించారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన ప్రెస్, ప్రింట్, సోషల్ మీడియా మిత్రులు భవిష్యత్ కార్యాచరణపై సూచనలు చేస్తూ "పీపుల్స్ పల్స్" యూట్యూబ్ ఛానల్ సేవలు విస్తృతపరచాలని, అసత్య వార్తలకు అడ్డుకట్ట వేయాలని, బాధితులకు అండగా నిలవాలని తీర్మానించారు. ఈ ఆశయం కోసం "ఐడియల్ జర్నలిస్ట్ ఫోరం, ఏపి" ఆవిర్భవించింది. ఫోరం ఏకగ్రీవ ఆమోదంతో రాష్ట్ర స్థాయి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పి. మీడియా కార్యదర్శి జనాబ్ అక్బర్ బాషా నాయకత్వంలో, సీనియర్ జర్నలిస్టు జనాబ్ షఫీ అహ్మద్, నాసర్ బాషా (హమారా హక్, కడప), రసూల్ ఖాన్ (tv 5), ఎస్.ఎం.రఫీ (ప్రకాశం), మజీద్ (మీ న్యూస్, నంద్యాల), జీ.యం. జఫరుల్లా (పబ్లిక్ వాయిస్ కర్నూలు), ఆజం, దాదా ఖలందర్ తదితరులు కమిటీలో వున్నారు. సమావేశంలో జమాఅత్ మీడియా ఇన్‌చార్జ్‌లు, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు పలువురు పాల్గొన్నారు.



**రిపోర్ట్: షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

గీటురాయి వారపత్రిక — సహజీవన భావనల పావురాయి

# ముఖ్య ఆశయాలు

- ☛ సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ☛ ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ☛ ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ☛ ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.



# పిల్లలను ప్రేమించండి

- నసీరా బేగం

ఒక పెద్ద మనిషి సముద్రం ఒడ్డున కూర్చొని విశ్వ సౌందర్యాన్ని తిలకిస్తూ, ఆలకిస్తూ, ఆస్వాదిస్తూ ఉన్నాడు. అంతలో అతని దృష్టికి సముద్రపు నీటిలో మునిగిపోతూ ఉన్న ఒక తేలు కనపడింది. అది నీటి నుంచి బయట ఒడ్డుకు చేరటానికి కృషి చేస్తూ ఉంది. కాని నీటి తాకిడిని ఎదురించలేకపోతోంది. ఇది చూసిన ఆ పెద్ద మనిషికి ఆ తేలుపై జాలి కలిగింది. తన చేత్తో దానిని రక్షించ డానికి ప్రయత్నించాడు. కాని ఆ తేలుకు పెద్ద మనిషి సంకల్పం తెలియదు కాబట్టి అది తనకు ఇతను హాని తలపెడుతున్నాడని భావించి అతని చేతిని కుట్టింది. అతని చేతినుంచి జారిపోయి మళ్ళీ నీళ్ళలో పడిపోయి తనను రక్షించుకోవటానికి ప్రయత్ని స్తోంది. ఆ పెద్దాయనకు మళ్ళీ ఆ తేలుపై జాలి కలిగింది. నొప్పిని భరించుకుంటూ మళ్ళీ ఆ తేలును రక్షించటానికి ప్రయత్నించాడు. కాని తేలు తన భయం, తన స్వభావం రీత్యా ఆయన్ను మళ్ళీ కుట్టింది. మళ్ళీ ఆయన చేతి నుంచి జారిపోయి నీటిలో పడి పోయింది. మళ్ళీ ఆయన దానిని రక్షించడానికి ప్రయత్నించాడు. మళ్ళీ కుట్టింది. ఇదంతా ఆ పెద్దాయన ప్రక్కనే కూర్చొని ఉన్న ఒక యువకుడు ఆశ్చర్యచకితుడై, ఏమిటి అది కుడుతూ ఉన్నా మీరు నొప్పిని భరించుకుంటూ ఎందుకు దాన్ని రక్షిస్తున్నారు అని అడిగాడు. ఆ యువకుడి మాటలు పెడచెవిన పెట్టి చివరకు తేలును రక్షించాడు ఆ పెద్దాయన. ఆ తరువాత యువకుడి భుజంపై చెయ్యి వేసి ప్రేమగా "చూడు బాబూ! తేలు స్వభావంలో కుట్టడం ఉంది. నా స్వభావంలో ప్రేమ, జాలి ఉన్నాయి. దేవుడిచ్చిన నా స్వభావం రీత్యా నేను రక్షించాను. చివరకు నేను సఫలమయ్యాను" అని బోధించాడు. ఈ గాథలో ఎంతో నిగూఢార్థం ఉంది. ఈ ఉదాహరణ ఎన్నో అంశాలకు ఉపోద్ఘాత మవుతుంది. కాని ఇక్కడ నేను పిల్లల స్వభావం, తల్లిదండ్రుల ప్రవర్తన గురించి చర్చించే అంశానికి కూడా ఇది చక్కగా సరిపోతుంది అని భావించాను.

చాలామంది తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రవర్తన చాలా బాధ కలిగిస్తుంది. పిల్లలు తల్లిదండ్రుల పట్ల అవిధేయత వ్యక్తం చేస్తారు. తమ చదువును నిర్లక్ష్యం చేస్తారు. తల్లిదండ్రులను బాధకు గురిచేస్తూ ఉంటారు. వారి జీవితాన్ని కష్టనష్టాల పాలు చేస్తూ ఉంటారు. అది పిల్లల స్వభావం. అటువంటప్పుడు తల్లిదండ్రులు ఆ పెద్దాయనలా నొప్పిని భరిస్తూ తేలును రక్షించిన విధంగానే పిల్లలను కాపాడుకోవాలి. కాని తల్లిదండ్రులు అలాంటి సమయాలలో సహనాన్ని కోల్పోతూ ఉంటారు. పిల్లలపై కఠిన వైఖరిని అవలంబిస్తారు. షేక్స్పియర్ ఇచ్చిన ఒక సూక్తి ఏమిటంటే, "ప్రేమించండి మిమ్మల్ని ద్వేషించటం మొదలు పెట్టేకంటే ముందు" అని. ఆయన చెప్పిన విధంగా పిల్లలను ప్రేమించాలి. వారు తల్లిదండ్రులను ద్వేషించటం మొదలు పెట్టే ముందు.

చాలామంది తల్లిదండ్రులు పిల్లలపై కఠిన వైఖరిని అవలంబిస్తేనే వారు సరైన శిక్షణలో ఉంటారు అని భావించి వారిని కొట్టడం, తిట్టడం చేస్తూ ఉంటారు. ఇంకా ఆ తల్లిదండ్రులు మేము కూడా ఇటువంటి కఠిన వాతావరణంలోనే పెరిగి పెద్దవారమ య్యాము కనుకనే ఇంత బాధ్యతగా ఉంటున్నాము అని అంటూ ఉంటారు. మేము మా బాల్యంలో, యవ్వనంలో కూడా మా

తండ్రి ముందు నోరు విప్పేవారము కాము. కనుక మా పిల్లలు కూడా ఇదే శిక్షణతో ఉండాలి. మా ముందు నోరు విప్పకూడదు. తల వంచుకుని ఉండాలి అని భావిస్తూ ఉంటారు. ఈ ధోరణి పిల్లల హృదయాలలో తల్లిదండ్రుల పట్ల గౌరవం కంటే భయాన్ని నాటుతుంది. దీని కారణంగా పిల్లలలో అధైర్యం, పిరికితనం, వ్యాకులత, బలహీనత లాంటి లక్షణాలు ఏర్పడతాయి. దాని కారణంగా వారు సహజమైన రీతిలో సమాజాన్ని ఎదుర్కొనే తత్వాన్ని కోల్పోతారనీ, సరైన సమయంలో స్వయంగా సరైన నిర్ణయాలు తీసుకోలేరనీ, ఎదుటివారి సహాయానికి ఆశ పడతారని, ఈ విధంగా వారి మనస్తత్వం ఏర్పడుతుందని, తద్వారా ఒక బాధ్యతాయుతమైన పౌరునిగా, కుటుంబ నిర్మాణానికి ఒక మంచి, దృఢమైన వ్యక్తిగా రాణించలేరని విశ్లేషకులు విశదీకరిస్తున్నారు.

## ప్రేమను పంచాలి

పిల్లల పెంపకం మంచి ప్రేమపూరితమైన వాతావరణంలో జరగాలి. పిల్లలు తల్లిదండ్రుల నుంచి ప్రేమను ఆశిస్తారు. వారు స్వర్గపు పుష్పాలు. పిల్లలు పుట్టినప్పటి నుంచే వారి కోసం ప్రత్యేక వాతావరణాన్ని కల్పించాలి. పిల్లల పెంపకం తల్లిదండ్రుల బాధ్యత. ఈ బాధ్యతను సంతోషంగా స్వీకరించాలి. భారంగా భావించకూడదు. వారి చిలిపి చేష్టలను, చిట్టిపొట్టి మాటలను ఆస్వాదించాలి. వారి ముందు చిరాకు పడకూడదు. తల్లి దండ్రులకు ఇతర బాధ్యతలు, కష్టాలు ఎన్నో ఉంటాయి. కాని అవి తమకు సంబంధించినవి. పిల్లలకు సంబంధించినవి ఎంతమాత్రం కాదు. తమ కోపతాపాలను వారి ముందు ప్రదర్శించకూడదు. సహనం వహించాలి. తాము ఎంత పనిలో నిమగ్నమై ఉన్నా తమ దృష్టి అంతా పిల్లలపైనే కేంద్రీకృతమై ఉండాలి. పసి వయసులోనూ, పెద్దవారైన తరువాతనూ తమకు దగ్గరలోనే పెట్టుకోవాలి. ఇతరులకు అప్పజెప్పకూడదు. పిల్లలపై కఠిన పదజాలాన్ని ఉపయోగించకూడదు. తిట్టకూడదు. ఒక పరిశోధనలో ఆశ్చర్యపరిచే విషయం బయటపడింది. అదేమి టంటే, ఒక పిల్లవాడు మంచి చెడూ తెలిసే వయసు నుంచి యవ్వనానికి చేరేవరకు వెయ్యి ప్రతికూల మాటలు వింటాడని, సానుకూల మాటలు కేవలం కొన్ని వందలే ఉంటాయని తెలిసింది.

దీనిద్వారా తెలిసే విషయమేమిటంటే, తల్లిదండ్రుల నోటి నుంచి అనుకోకుండానే ప్రతికూల మాటలు వెలువడుతూ ఉంటాయి. అవి పిల్లల హృదయాలకు గుచ్చుకుంటూ ఉంటాయి. ఉదాహరణకు, సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలకు అది చెయ్యబాకు, ఇది చెయ్యబాకు, అక్కడకు వెళ్ళకు, ఇక్కడకు వెళ్ళకు, అది తినకు, ఇది తినకు అనే పదాలతోనే వారికి శిక్షణ ఇస్తూ ఉంటారు. ఈ మాటలు పిల్లల కాళ్ళకు బంధాలు వేస్తూ ఉంటాయి. ముందడుగు వెయ్యటంలో ఆటంకాలను కల్గిస్తూ ఉంటాయి. ఇంకా వారి జీవితంలో ఇతరులతో పోటీపడకుండా ఆపుతూ ఉంటాయి. ప్రతి మాటకు ఇది చెయ్యాలా, చెయ్యకూడదా అనే సందిగ్ధానికి గురిచేస్తూ ఉంటాయి.

అలాకాకుండా తల్లిదండ్రులు పిల్లలకు సానుకూల మాటలు ఇలా చెయ్యి, అలా చెయ్యి, ఇది తిను, ఇది మంచిది, చాలా బాగా చెప్పావు, చాలా బాగా చేశావు, చాలా బాగా చదివావు అనే మాటలు మాట్లాడుతూ ఉంటే ఈ మాటలు వారికి ప్రోత్సాహకర మాటలుగా పనికొస్తాయి. వెన్ను తట్టి ముందుకు నడపటానికి ఉపయోగపడతాయి. ఒక ధైర్యవంతునిగా నిర్ణయాలు తీసుకోవ డానికి తోడ్పడతాయి. నలుగురి ముందు ఆత్మ విశ్వాసంతో నిలబడడానికి సహాయపడతాయి. తనపై తనకు నమ్మకం ఏర్పడేలా చేస్తాయి. సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వడం కోసం ధనం వెంటపడతారు. డబ్బులతో మంచి స్కూళ్ళలో చేర్పించగలమని, ఖరీదైన వస్తువులు కొనివ్వగలమని, వారి కోసం ఆస్తిపాస్తులు కూడబెడదామని కృషి చేస్తూ ఉంటారు. కాని ఆలోచిస్తే అర్థమయ్యే విషయమేమిటంటే, ధనం కంటే విలువైనది పిల్లలకు ప్రోత్సాహకర మాటల ద్వారా శిక్షణ. వారిని ఒక మంచి పౌరునిగా తీర్చిదిద్దటం కోసం పుట్టిన రోజు నుంచే పిల్లల బాధ్యతను గ్రహించటం. తల్లిదండ్రులు ఇద్దరూ ఒక్కటై పరస్పర మనస్పర్థలు మాని కృషి చెయ్యటం. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరినీ సమాన దృష్టితో చూడటం. అమ్మాయి, అబ్బాయి అనే తేడాలు లేకుండా పెంచటం. ఒక్కొక్కరిలో ఒక్కోవిధంగా ఉండే నైపుణ్యాలను వెలికి తీయటం. ఆ నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకుని వారిని ఆ దిశగా ప్రోత్సహించటం. వారి మధ్య ప్రేమను పెంచే ప్రయత్నం చెయ్యటం. దాని కోసం వారి ఉపాధ్యాయుల సలహాలను కూడా తీసుకోవటం. ఇదంతా చెయ్యటం కోసం తల్లిదండ్రుల అధిక సమయం అవసరమవుతుంది. కనుక తల్లిదండ్రులు వారి కోసం సమయం వెచ్చించాలి.

పిల్లల మనస్తత్వం రీత్యా వారికి ఒక ముఖ్య అవసరం ఏమి టంటే, తల్లిదండ్రుల ప్రేమ. తల్లిదండ్రుల ద్వారా ఈ ప్రేమ లభించికపోయినట్లయితే వారు నిస్సహాయతకు గురవుతారు. దాని కారణంగా వారిలో ఎన్నో మానసిక రుగ్మతలు తలెత్తుతాయి. తల్లిదండ్రులు పిల్లలను ప్రేమపూర్వకంగా హత్తుకున్నట్లయితే వారికి ఒక విధమైన మానసిక ప్రశాంతత లభిస్తుంది. కనుక తల్లిదండ్రులు పిల్లలను హత్తుకోవటంలో, ముద్దు పెట్టుకోవ టంలో పిసినారులుగా ఉండకూడదు. పిల్లలకు అన్నపానీయాల అవసరం ఎంతగా ఉంటాయో అంతే ప్రేమపూర్వకంగా తల్లిదండ్రులు వారిని హత్తుకోవటం, ముద్దు పెట్టుకోవటం అవసరం కూడా అంతే ఉంటుంది. చివరగా చెప్పొచ్చేదేమిటంటే, పిల్లలను తల్లిదండ్రులు ప్రేమించడంలో అతి గారాబం చెయ్యకూడదు. అతి గారాబం పిల్లల శిక్షణను చెడగొడుతుంది. కనుక ప్రేమలో శిక్షణ కూడా ఉట్టిపడుతూ ఉండాలి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు    మక్కా అవతరణ

# 46. అల్ అహ్‌ఖాఫ్

11 – 14 ఎవరయితే నమ్మడానికి నిరాకరించారో వారు విశ్వసించిన వారిని గురించి ఇలా అంటున్నారు, "ఈ గ్రంథాన్ని నమ్మడం ఏదయినా మంచి పని అయ్యే మాటయితే వీరు ఈ వ్యవహారంలో మాకన్నా అగ్రగాములవడం సాధ్యమయ్యేది కాదు."[15] దీనిద్వారా వీరు ఎలాగూ సన్మార్గబోధనను గ్రహించలేదు కనుక వీరు, 'ఇదైతే పాత అబద్ధం' అని తప్పక అంటారు.[16] వాస్తవానికి దీనికి పూర్వం మూసా గ్రంథం మార్గదర్శకం, కారుణ్యమయి వచ్చే ఉంది. మరి ఈ గ్రంథమేమో దాన్ని ధ్రువీకరించేదిగా అరబీ భాషలో వచ్చింది. తద్వారా దౌర్జన్యపరులను హెచ్చరించాలని,[17] సదాచార వైఖరి నవలంబించే వారికి శుభ వార్తనివ్వాలని. నిశ్చయంగా ఎవరయితే అల్లాహ్ మాత్రమే మా ప్రభువు అని అన్నారో, దాని మీద నిలకడ చూపారో వారికి ఎటువంటి భయమూ లేదు, వారు దుఃఖపడవలసిన అవసరమూ లేదు.[18] ఇలాంటి జనులెల్లరూ స్వర్గంలోకి చేరవలసినవారే, అక్కడ వారు సర్వదా ఉంటారు – వారు ప్రపంచంలో చేస్తూ ఉన్న ఆచరణలకు ప్రతిఫలంగా.

15. కురైష్ నాయకులు సామాన్య ప్రజల్ని ప్రవక్త మహనీయులకు వ్యతిరేకంగా ఉసిగొలపడానికి ప్రయోగించే వాదనల్లో ఇదీ ఒకటి. వారు చెప్పేదేమిటంటే, ఈ ఖుర్ఆన్ సత్యమయినదయితే ముహమ్మద్ (స) సత్యమయిన మాట వైపునకు పిలుపునిచ్చే వారయితే జాతిలోని నాయకులు, పెద్దలు, గౌరవనీయులయిన పౌరులు ముందుకు వచ్చి స్వీకరించేవారు కారా? కొందరు అనుభవం లేని కుర్రకారు, కొందరు హీనమయిన బానిసలయితే ఒక సమంజసమయిన విషయాన్ని స్వీకరించడం, జాతిలోని పెద్దలు, వివేకులూ, దూరదృష్టి గల వారూ, ప్రపంచ జ్ఞానమున్న వారు, ఎవరి బుద్ధీ వివేకాలను నేటి వరకు జాతి విశ్వసిస్తూ వచ్చిందో వారు దీన్ని తిరస్కరించడం ఎలా సాధ్యమయ్యేది? ఈ వంచనా పూర్వకమయిన వాదనతో వారు సామాన్య జనుల్ని సంతృప్తపరచడానికి ప్రయత్నించేవారు. ఈ కొత్త సందేశంలో ఏదో లోపం, చెడుగు ఉన్నాయి. అందువల్లనే జాతిలోని ఘను లెవరూ దీన్ని నమ్మడం లేదు, కనుక మీరున్నూ దానికి దూరంగానే పరుగెత్తండి అని చెప్పేవారు.

16. అంటే, వీరు తమ్ము తాము సత్యాసత్యాల ప్రమాణంగా పరిగణించారు. తాము స్వీకరించని ఏ మార్గబోధన అయినా అది తప్పనిసరిగా మార్గవిహీనతే కాగలదు. కాని దాన్ని "కొత్త అబద్ధం"గా చిత్రించే సాహసం మటుకు చేయలేరు. ఎందుకంటే లోగడ కూడా దైవప్రవక్తలు ఈ బోధనలే అందజేసేవారు. గ్రంథవహులయిన వారి వద్దనున్న దైవిక గ్రంథాలన్నింటిలోనూ ఈ నమ్మకాలు, ఈ మార్గబోధనలు మటుకే నిండి ఉన్నాయి. అందువల్ల వారు దీన్ని "పాత అబద్ధం" అనేవారు. అంటే వీరి దృష్టిలో ఎవరయితే వేల సంవత్సరాల తరబడి ఈ యదార్థాలను అందజేస్తూ వచ్చారో, నమ్ముతూ వచ్చారో వారంతా వివేక శూన్యులు, ఇకపోతే వివేచన అంతా వీరికే స్వంతమయి పోయిందన్నమాట.

17. అంటే, వీరికి అంతిమ పరిణామంగా కలిగే కీడును గురించి హెచ్చరిక చెయ్యి. వీరు అల్లాహ్ పట్ల తిరస్కారం, దైవేతరుల పట్ల దాస్యం ఆచరిస్తూ తమపైనా, సత్యం, సత్యతలపైనా అన్యాయం, అక్రమం జరుపుతున్నారు. తమ ఈ మార్గవిహీనత కారణంగా నైతికతలోనూ, ఆచరణల్లోనూ అనేక చెడుగులకు లోనయ్యారు. వాటివల్ల మానవ సమాజం రకరకాల అన్యాయాలకు, అత్యాచారాలకు ఆలవాలమయి పోయింది.

18. వివరణకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.7, హామీమ్ అస్ సజ్దా: పాద సూచికలు 33 – 35.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

## సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

# ప్రవక్త మహనీయులు (సఅసమ్) అస్వస్థతకు గురైనప్పుడు

**299)** హజ్రత్ ఆయిషా(ర.అ) అబ్బాద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: మరణానికి ముందు నేను దైవప్రవక్త(సఅసమ్) పలుకులను చెవియొగ్గి విన్నాను. ఆ క్షణంలో ఆయన(స) తన వీపును నాకు ఆనించి ఉన్నారు– ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! నన్ను క్షమించు. నాపై దయజూపు. నన్ను ఉన్నత మిత్రుల సరసన చేర్చు."

**300)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు ఇలా పలికారు– "అల్లాహ్ యూదులను తన కారుణ్యానికి దూరం చేయుగాక! వారు దైవప్రవక్తల సమాధులను సాష్టాంగ ప్రణామ స్థలాలుగా చేసుకున్నారు"– ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: "ఈ భయమే గనక లేకున్నట్లయితే ఆయన సమాధి కూడా బహిరంగ స్థలంలో ఉంచ బడేది. తన సమాధిని జనులు సాష్టాంగ స్థలంగా చేసుకుంటారేమోనన్న చింత ఆయనకు ఉండేది".

**301)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనువు చాలించినప్పుడు ఆయన శిరస్సు నా కంఠాభరణానికీ– నా చుబుకానికీ మధ్యన ఉంది. దైవప్రవక్త(స) మరణ ఘడియలలో అనుభవించిన వేదనను చూసిన తరువాత నేను ఎవరి మరణ వేదనను కూడా చెడుగా భావించను.[1]

**302)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ మైమూనా (ర.అ) ఇంట అస్వస్థతకు గురై, వ్యాధి తీవ్రతరమైనప్పుడు, ఆయన (స) తన (ఇతర) భార్యలను పిలిచి, ఈ స్థితిలో తాను నా ఇంట్లో ఉండదలుస్తున్నానని చెప్పారు. అందుకు వారంతా అనుమతి ఇచ్చారు. ఆయన(స) ఇద్దరు మనుషుల ఆసరాతో కాళ్ళీడ్చుకుంటూ వచ్చారు. ఆ ఇద్దరిలో ఒకరు అబ్బాస్(రజి), మరొకరు మరో వ్యక్తి.

నేను హజ్రత్ ఆయిషా(ర.అ) గారి ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి)కు వినిపించగా, 'హజ్రత్ ఆయిషా (ర.అ) పేరు ప్రస్తావించని ఆ రెండవ వ్యక్తి ఎవరో మీకు తెలుసా?' అని అడగ్గా, 'లేద'ని నేనన్నాను. 'ఆయన ఎవరో కారు, హజ్రత్ అలీ(రజి)' అని ఆయన చెప్పారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అనేవారు: దైవప్రవక్త(స)ను నా కుటీరానికి చేర్చిన తర్వాత ఆయన(స)

**వ్యాధి మరింత తీవ్ర స్థాయికి చేరుకుంది. అప్పుడాయన(స), "మూతి బిగించి కట్టబడిన ఏడు నీళ్ళ తిత్తులను తెచ్చి నా మీద కుమ్మరించండి (బహుశా జ్వరం తగ్గుతుందేమో). అప్పుడు నేను జనులకు ఏదయినా వసీయతు చేయగలను" అని ఆదేశించారు. అప్పుడు మేము ఆయన్ని సఫియ్యా (ర.అ) గారి తొట్టెలో కూర్చోబెట్టి ఆయన(స)పై నీరు కుమ్మరించసాగాము. "చాలు చాలు" అని ఆయన(స) సైగ చేశాక మేము నీరు పోయటం ఆపేశాము. తరువాత ఆయన జనుల వద్దకు వెళ్ళి, వారికి నమాజ్ చేయించారు. వారినుద్దేశించి ఉపన్యాసమిచ్చారు.[1]**

**(జుహ్రీ కథనం ప్రకారం) హజ్రత్ ఆయిషా (ర.అ), అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర.అ) ఇలా చెప్పారని ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ ఉతబా తెలిపారు– దైవప్రవక్త(స) జబ్బు తీవ్రమైనప్పుడు, ఆయన(స) తన దుప్పటిని ముఖంపై కప్పుకునేవారు. (ఉక్కపోతతో) ఉక్కిరిబిక్కిరి అయినప్పుడు దుప్పటిని ముఖంపైనుంచి తొలగించేవారు. ఆ వ్యాకుల స్థితిలోనే ఇలా అనేవారు: "యూదులు, క్రైస్తవులు దైవ కారుణ్యానికి దూరం అవుగాక! వారు తమ ప్రవక్తల గోరీలను ప్రార్థనాలయంగా చేసుకున్నారు". ఈ దుష్టపోకడ నుంచి ఆయన(స) జనులను వారించేవారు.[2]**

**అమ్మ ఆయిషా(ర.అ) ఈ విధంగా చెప్పినట్లుగా ఉబైదుల్లాహ్ తనకు తెలిపారని జుహ్రీ ఉటంకించారు: (అబూబక్ర్–రజి–కు ఇమామత్ చేయమని చెప్పండి అన్న) దైవప్రవక్త(స) ఆదేశాన్ని నేను పలుమార్లు దాటవేశాను. ఎందుకంటే ప్రవక్త తదనంతరం ఆయనకు వారసుడు అయ్యే వ్యక్తిని జనులు ప్రేమాభి మానంతో చూడబోరని, పైగా అతనిని దరిద్రునిగా చూస్తారని నేను ఊహించాను. అందుకే దైవప్రవక్త(స) ఈ పని నుండి (అంటే ప్రజల సామూహిక నమాజ్‌కు నేతృత్వం వహించే పని నుండి) అబూబక్ర్(రజి)ను మినహాయించాలని నేను కోరుకున్నాను. ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి), అబూ మూసా అష్అరీ (రజి), ఇబ్నె అబ్బాస్(రజి) కూడా దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.**

---

301-1. మరణ సమయంలో దైవప్రవక్త(స) తీవ్రమయిన బాధకు లోనయ్యారు. ఆయన నీళ్లు తీసుకుని పదేపదే తన ముఖం మీద చల్లుకుంటూ "**లా ఇలాహ ఇల్లల్లాహ్**- మరణ బాధ కూడా బహు కఠినమైనది'' అని అనేవారు.

302-1. ముస్లిమ్‌లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: ఈ సంఘటన దైవప్రవక్త(స) పరమపదించడానికి అయిదు రోజుల ముందు జరిగింది. ఆయన(స) తన ప్రసంగంలో ఇలా అన్నారు: "అల్లాహ్ తన ఒక దాసుణ్ణి పరీక్షించాడు. కాని ఆ దాసుడు ప్రపంచాన్ని కాకుండా, పరలోకాన్ని ఇష్ట పడ్డాడు''. ఇది విని అబూబక్ర్(రజి) దుఃఖంతో విలపిం చారు. ఇలా అన్నారు : '(దైవప్రవక్తా!) మా తల్లిదండ్రులు, మా ధన ప్రాణాలు మీకు అర్పితం'. దీని తరువాత ఆయన (స) మరణం వరకూ ఏ ప్రసంగం కూడా చేయలేదు.

302-2. ఆయన(స) చిట్టచివరి హితోపదేశం ఇది: ''నా సమాధిని మస్జిద్ (సాష్టాంగ ప్రణామ స్థలం)గా చేయరాదు. దానిని విగ్రహంగా చేయకూడదు.''

శోచనీయమైన విషయం ఏమిటంటే ఆయన(స) గారి హిత బోధకు బహు కొద్దిమంది ముస్లింలు మాత్రమే కట్టుబడి ఉన్నారు. వీరే సిసలైన మువహ్హిదీలు (ఏకేశ్వరో పాసకులు). మిగిలిన సోకాల్డ్ ముస్లింల గురించి ఏమని చెప్పేది!? దైవ ప్రవక్తల సమాధుల సంగతి అలావుంచి, వారు పీర్ల, ముర్షిద్‌ల, గురువుల గోరీలను కూడా సాష్టాంగ ప్రణామ స్థలాలుగా చేసుకున్నారు. ఆ సమాధుల చుట్టూ ప్రదక్షిణ కూడా చేస్తారు. అక్కడ తమ అర్జీలను వ్రేలాడదీస్తున్నారు- **లా హౌల వ లాఖువ్వత ఇల్లా బిల్లాహ్.**




**గత సంచిక తరువాయి...**

## మూఢ నమ్మకాలకు దూరంగా...

బయటకు వెళ్లేటప్పుడు పిల్లి అడ్డం వస్తే అపశకునమని, తింటున్నప్పుడు ఎవరైనా చూస్తే దిష్టి తగులుతుందని, మనకు దిష్టి తగలకుండా ఉండాలంటే నల్లదారం కట్టుకోవాలని.. ఏదైనా అనారోగ్యం చేస్తే చేతబడి ప్రభావమని, గాలి తగిలిందని.. ఇలాంటి మూఢ నమ్మకాలు ఇప్పటికీ నమ్మేవారు ఉన్నారు. ఇవి మీ ఎదుగుదలకు, మనుషుల మధ్య ఆరోగ్యవంతమైన సంబంధాలకు విఘాతంగా మారుతాయి. కాబట్టి వాస్తవికంగా ఆలోచించాలి. వాస్తవంలో జీవించాలి. మూఢ నమ్మకాలను, షిర్క్ బిద్అత్‌లను వదిలితే మనం మరింత సంతోషంగా ఉండగలుగుతాము. కొత్త సంవత్సరంలో ఈ నిర్ణయం తీసుకోవడం మనకెంతో మేలు చేస్తుంది.

మరణం తరువాత ఏమి జరుగుతుంది అని ఆలోచించే కంటే, బ్రతికున్నంత కాలం ఎవ్వరినీ నొప్పించకుండా, ఏమీ ఆశించకుండా, వారి ప్రాధాన్యతలను విమర్శించకుండా, వారి లోని మంచిని గ్రహిస్తే మరణం తరువాత కూడా మంచే జరుగు తుంది. ఆధ్యాత్మిక చింతనలో శాంతి, సౌభాగ్యం లభిస్తాయి, మానవతా విలువలతో సంతోషం, సంయమనం లభిస్తాయి. మంచి మాటలు మాట్లాడే క్రమంలో గౌరవం, మర్యాద లభిస్తాయి, మంచి, మానవత్వం, ఆధ్యాత్మిక తత్వం సమన్వయం చేసుకుంటే సంస్కారవంతమైన జీవితం లభిస్తుంది.

## మంచికి సంకేతం మార్పు

మంచో, చెడో, సంతోషమో, సంతాపమో, కష్టమో, నష్టమో, విజయమో, వీర స్వర్గమో హిజ్రీ సంవత్సరం ఎలాగూ గడచి పోయింది. ఇక నుంచైనా మనం మారాలి బ్రో అనుకుంటున్న యువత కొంగొత్త ఆలోచనలతో, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఇప్పటికే డిసైడ్ అయిపోవాలి. గడిచిన కాలాన్ని జ్ఞాపకాల డైరీలో భద్రపరచి.. ఈ రోజు నుంచే కొత్త డైరీనే కాదు, కొత్త లక్ష్యం దిశగా అడుగులు వేసేందుకు రెడీగా ఉండాలి యువతరం. ఇన్ని రోజులు ఓ లెక్క.. ఇప్పటి నుంచి ఓ లెక్క.. నేను మారాలి బ్రో.. టైమ్ వేస్ట్ చేయకూడదు అంటూ స్ట్రాంగ్ డెసిషన్ తీసుకోవాలి. తేట నీటిలో ప్రతిబింబం, మంచి నీటిలో పరిశుద్ధం, వాన నీటిలో వెచ్చదనం, పారే నీటిలో మృదుత్వం ఎలా ఉంటాయో కల్మషం లేని మనసుతో కూడిన చిరునవ్వు అలా శోభిల్లుతుంది. దీనికి మానవత్వం తోడైతే మనిషి జన్మ సార్థకం అవుతుంది

## అలవాట్లు మార్చుకుందాం

మన అలవాట్లను బట్టి కూడా సక్సెస్, ఫెయిల్యూర్, ఆనందం, ఆరోగ్యం వంటివి ఆధారపడి ఉంటాయి. ఇటీవల చాలామందిలో ఏజింగ్ హాబిట్స్ పెరుగుతున్నట్లు నిపుణులు

చెబుతున్నారు. మద్యపానం, ధూమపానం, జంక్ ఫుడ్ తరచుగా తినడం వంటి అలవాట్లవల్ల చిన్న వయస్సులోనే ముఖంపై ముడతలు, జుట్టు రాలిపోవడం, నడుము వంగిపోవడం, ముఖ వర్చస్సు తగ్గడం వంటి సమస్యలను పలువురు ఎదుర్కొంటున్నారు. దీంతో యవ్వన దశలోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయని ఆందోళన చెందుతుంటారు. కాబట్టి ఈ సంవత్సరం నుంచైనా అలాంటి బ్యాడ్ హాబిట్స్‌ని వదులుకోవాలని దృఢ సంకల్పం చేసుకోవాలి.

జీవితాన్ని కొంతమంది ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు - కొంతమంది ధనార్జన, ఆడంబర సేవాభావంతో గడుపుతారు - కొంతమంది భోగ లాలస రసికతతో గడుపుతారు - కానీ జీవితం భిన్న భావాల సమ్మేళనం - అన్ని అనుభవాలను సమపాళ్లలో స్పృశిస్తేనే జీవితం పరిపూర్ణం అవుతుంది.

## మనకు మనమే బాధ్యులం

తెలిసో తెలియకో గత సంవత్సరం మనం పలు విషయాల్లో పొరపాట్లు చేసి ఉండవచ్చు. అయితే ఈ సంవత్సరం వాటి గురించి ఆలోచించడం మానేయండి. మిమ్మల్ని మీరు క్షమించుకోండి. మీరు చేసిన పొరపాట్లను అంగీకరించి, ఇక నుంచి అలాంటివి చేయవద్దని నిర్ణయించుకోండి. మీవల్ల జరిగిన, జరగబోయే తప్పొప్పులకు మీరే బాధ్యులని అంగీకరించడం ద్వారా కొత్త సంవత్సరంలో మీరు సంతోషంగా ఉంటారు. సమస్యలను ఎదుర్కొంటూ, పొరపాట్లు సరిదిద్దుకుంటూ ముందుకు సాగితే దానికి మించిన భాగ్యం మరొకటి లేదు. మనసులో దాచుకున్న ప్రేమ మాటల ద్వారా కానీ చేతల ద్వారా కానీ వ్యక్తపరచకపోతే వ్యర్థమే. మస్తిష్కంలో మెదిలే ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఆచరణలో పెట్టకపోతే అనర్థమే. మాట అయినా, ప్రేమ అయినా, ఆలోచన అయినా ఆచరణే ఆదర్శం.

మనలో చాలా మందికి ఉండే అలవాటు ఇతరుల తప్పులు ఎత్తి చూపడం. ఇక నుంచి ఇలాంటి వన్సైడ్ ఆలోచన మానుకోండి. ఇతరుల తప్పులకంటే ముందు మన పొరపాట్లను, తప్పులను గుర్తించాలి. చక్కదిద్దుకునే ప్రయత్నం చేయాలి.

విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటివారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలు నెలకొల్పండి. దేవునికి భయపడండి, మీరు కరుణించబడతారు. (49: 10)

విశ్వాసులారా! పురుషులు తోటి పురుషుల్ని హేళన చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. అలాగే స్త్రీలు తోటి స్త్రీలను గేలి చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. మీరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తిచూపుకుంటూ పరస్పరం బురద చల్లుకోకండి. తప్పుడు పేర్లతో పిలుచుకోకండి. విశ్వాసభాగ్యం పొందిన తర్వాత చెడ్డపేరు తెచ్చుకోవడం చాలా తప్పు. ఈ వైఖరి మానుకోని వారే దుర్మార్గులు. (49: 11)

విశ్వాసులారా! మితిమీరిన అనుమానాలకు పోకండి. కొన్ని అనుమానాలు (మీకు) పాపాలుగా పరిణమించవచ్చు. (ప్రజల) రహస్య విషయాల వెనుక పడకండి. మీలో ఎవరూ ఇతరుల్ని పరోక్షంగా నిందించకూడదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా? (ఇష్టపడరు.) చూశారా, మీరే దాన్ని అసహ్యించుకుంటారు. దేవునికి భయపడండి. దేవుడు ఎంతో క్షమాశీలి, దయామయుడు. (49: 12)

ఆశ మనిషిని భవిష్యత్తు వైపు నడిపిస్తుంది. అత్యాశ మనిషిని పతనం దిశగా నడిపిస్తుంది దురాశ మనిషిని దుఃఖంలో ముంచుతుంది. నిరాశ మనిషిలో ఆత్మన్యూనతా భావం పెంచుతుంది. కానీ ఆశ లేని జీవితం సంద్రంలో దిక్సూచి లేని ఓడ లాంటిది.

వర్తమానంతో మమేకం అవకపోతే భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం చేయలేము, భవిష్యత్తుపై ఆశలు లేకపోతే జీవితం కొనసాగించలేము. అవసరంతో ముడిపడిన బంధాలు నీటి బుడగలు లాంటివి. మనసుతో మమేకమైన బంధాలు పాలు నీళ్ళు లాంటివి స్నేహంతో ముడిపడిన బంధాలు వెలుగును నింపే కొవ్వొత్తి లాంటివి.

సహనం నశిస్తే తిరుగుబాటు మొదలవుతుంది-ఆలోచన నశిస్తే ఆందోళన మొదలవుతుంది. సంస్కారం నశిస్తే అహంకారం

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మొదలవుతుంది. సంయమనం పాటిస్తే అంతా సవ్యంగానే ఉంటుంది. జననం భూమి మీద శాశ్వతం కాదు, ఒక ఘటన మరణం శాశ్వత అంతం కాదు, ఒక విడిది జనన మరణాలు కర్మఫలాలకు తాత్కాలిక మజిలీలు, పరలోక మోక్షం, ఆధ్యాత్మిక సాధన ద్వారా మాత్రమే సాధ్యం.

**చివరి మాట :**

మనసు మంచిదైతే అది పవిత్రాలయం- మాట మంచిదైతే అది విద్యాలయం- నడత మంచిదైతే అది సంస్కార నిలయం- ఇన్ని మానవతా విలువలతో కూడిన దేహం నిత్యానందాలయం. దైవాన్ని భక్తితో ఆరాధించు- బాధ్యతను సంతృప్తిగా స్వీకరించు- కర్తవ్యాన్ని దక్షతతో నిర్వహించు- విజయాన్ని సాధనతో సాధించు- సంకల్పం, చిత్తశుద్ధి అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తాయి.

శ్రమకు తగ్గ ప్రతిఫలం ఆశించాలి, అంతేకానీ చేసిన సహాయానికి మాత్రం ఆశించకూడదు - ప్రయత్నానికి తగ్గ ఫలితం కోరుకోవాలి, కానీ సాధనలేని విజయాన్ని ఆశించకూడదు. మాట నోరు జారకూడదు - మనసు అదుపు తప్ప కూడదు - కాయం (శరీరం)భోగాలకు బానిస కాకూడదు - ఆత్మాభిమానం అహంగా మారకూడదు - అప్పుడే సచ్ఛీలత, మానవతా విలువలతో మనిషి వ్యక్తిత్వం వికసిస్తుంది.

మానవ మేధస్సు వలన మహోన్నతులుగా మారవచ్చు - పట్టుదల, సాధన వలన సత్ఫలితాలను పొందవచ్చు - సత్ప్రవర్తన, సంకల్ప బలంతో మహాత్ములుగా నిలబడవచ్చు- కానీ అల్లాహ్ యెడల భక్తితో, ధ్యానంతో, అల్లాహ్ దాసుల యెడల దయార్ద్ర హృదయంతో మాత్రమే మానవుడు అల్లాహ్ ప్రసన్నతను పొందగలడు. కాబట్టి విధి వ్రాతను నిందించకు, సరిదిద్దడానికి ప్రయత్నించు - ధర్మాన్ని విస్మరించకు, ఆచరణ బాధ్యతగా స్వీకరించు - ఆత్మను నిందించకు, కర్మల ద్వారా శుద్ధికి ప్రయత్నించు - ఆచరణ, ప్రయత్నము, సంకల్పము ఈ మూడు మాత్రమే సకల సందేహాలను నివృత్తి చేయగలవు. ఇక సద్భావనతో సత్సంగం సాగిస్తే అన్నీ సానుకూలమే.

## ఒత్తిడి




మనం చేయాల్సిన పనులు ఎక్కువ, టైమ్ చాలా తక్కువ ఉందని తరచుగా ఆలోచించడం వల్ల ఒత్తిడి కలుగుతుంది. మనలో చాలామంది సమయం చాలటం లేదని అంటుంటారు. దీనితో ఒత్తిడి పెరుగుతుంది. చివరికి ఇదొక సాలెగూడు మాదిరిగా తయారవుతుంది. సమయం వల్ల ఒత్తిడి పెరిగిపోవటానికి గల ముఖ్య కారణాల్లో ఒకటి మనలో చాలామంది ఎవరికీ 'నో' అని చెప్పుకోలేకపోవడం. దీనివల్ల ఎవరే పని చెప్పినా చెయ్యవలసిన పరిస్థితిలో చిక్కుకుంటాం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

మనం పనిచేసే ఆఫీసులో పై అధికారి వచ్చి ఒక కొత్త పని అప్పగించారనుకోండి. వెంటనే 'అలాగే సార్! ఇప్పుడే మొదలు పెట్టేస్తాను' అంటాం. తరువాత మనం దీనికి టైమెక్కడుందా అని దిగులుతో కుంగిపోతుంటాం. దానికి బదులు మీరేం చెప్పి ఉండాల్సింది? 'సార్ ఒక నిమిషం. ఈ పని చేయాలని ఉంది. వెంటనే చెయ్యాలని ఉంది గానీ, దీనికోసం ఇంకో పని ఆపేయాల్సి ఉంది. దేనిని వాయిదా వెయ్యమంటారో మీరే చెప్పండి అని మర్యాదగా చెబితే బాగుండేది. మీరు నిజంగా పని ఎక్కువై ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పుడు, ఆ సంగతి పైకి చెప్పుకోలేకపోతే మీ గొయ్యి మీరే తవ్వుకున్నట్లే.

మన పని ఒత్తిడి గురించి అందరూ తెలుసుకోవాలని భావిస్తాం. అది నిజమే కావచ్చు కానీ, టైముకు పని పూర్తి చెయ్యకపోతే సంజాయిషీ అడిగి, మీ పని ఒత్తిడి గురించి 'బాస్‌లు' అడిగి తెలుసుకుంటారు. అంతే కానీ, అప్పటిదాకా వాళ్ళకి మీ ఒత్తిడి గురించి అనవసరం. ఇలాంటి సమస్యల్ని మొదట్లోనే పరిష్కరించుకోవడం శ్రేయస్కరం. మనం పైకి చెప్పడం (నో అని) ఖచ్చితంగా అలవాటు చేసుకోవాలి. మన పని గురించి ఎంత సమయం పడుతుందో నిర్ధారించుకొని, అదనపు పని ఇచ్చినప్పుడు చెయ్యలేనని ముందే చెప్పెయ్యండి. పని ఒత్తిడి పెరిగిపోయిన పరిస్థితులలో ఎవరూ సక్రమంగా తప్పులేకుండా పని చేయలేరని గుర్తుంచుకోండి!

**- మంగళగిరి జీలాని**




♦ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఎక్కువ.. ఉపాధ్యాయులు తక్కువ.

♦ దీని వల్ల విద్యా ప్రమాణాలు, నాణ్యత తీవ్రంగా ప్రభావితం

♦ ప్రైవేటు స్కూళ్లలో బోధన కన్నా లాభార్జనే ముఖ్యం!

**- అర్షియా**

**ఇటీవల కాలంలో భారతదేశంలో పాఠశాల విద్య తీవ్ర విమర్శలకు లోనవుతోంది.** పిల్లల చదువులపై ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, విద్యా ప్రమాణాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. అత్యంత ఆందోళనకరమైన ధోరణి ఏమిటంటే, అనేక ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకోవడాన్నే తమ ప్రధాన లక్ష్యంగా మలుచుకున్నాయి. విద్యా నిలయాలుగా ఉండాల్సిన పాఠశాలలు ఇప్పుడు లాభాపేక్ష కేంద్రాలుగా మారిపోయాయి.

### లాభమే లక్ష్యం

విద్యా నాణ్యతలో వెనకబడ్డ విషయం ఒక పక్క మేధావులను, తల్లిదండ్రులను బాధిస్తుంటే, స్కూలు ఫీజులు ఏటా ఎడా పెడా పెరుగుతుండటం మరో ఆందోళనకర అంశం. నర్సరీ, LKG క్లాసులకే ఏడాదికి రూ.1 లక్ష నుండి రూ.2.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తుండటం అత్యంత ఆందోళనకరం. ముఖ్యంగా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో చాలా మందికి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో లేవు. ఇలాంటి చోట ఇంత ఎక్కువ రుసుములు ఉండటం సమాజంలో అంతరాలనూ సూచిస్తున్నది.

ఇటీవలి గణాంకాల ప్రకారం, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజేందుకు కొత్త కొత్త మార్గాలు కనిపెడుతుండటమే ఇందుకు కారణం. యూనిఫారాలు, షూస్, పుస్తకాలు, స్టేషనరీ.. ఇలా విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు తమ బడిలోనే కొనాలని అవి ఒత్తిడి చేస్తుంటాయి. మార్కెట్ ధర కన్నా 30-45 రూపాయలు ఎక్కువ ధరకు ఆ వస్తువులను విక్రయిస్తూ లాభాలను దండుకొంటున్నాయి. ఒకవేళ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు రేషన్ పంపిణీ చేసే లైసెన్స్ ఇస్తే వాళ్లు రేషన్ సరుకులను కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు అంటగడతారు. తమ పాఠశాల పక్కన తమ వాళ్ల పెట్రోల్ బంక్ ఉంటే, అక్కడే ఇంధనం కొనమని పిల్లల తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తారు.

## ప్రమాణాల పతనం ప్రమాదకరం

దురదృష్టవశాత్తూ, చాలా స్కూళ్లు విద్యపై కాకుండా వ్యాపార ఆలోచనలపైనే దృష్టి పెడుతుండంతో బోధన ప్రమాణాలు, విద్యార్థుల నైపుణ్యాలు పతనమవుతున్నాయి. పిల్లలను తమ స్కూల్లోనే ప్రైవేట్ ట్యూషన్లకు పంపాలని, లేదా తమ టీచర్లు నడిపే ట్యూషన్ సెంటర్లకు వాళ్లను పంపాలని స్కూళ్ల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇది విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. ట్యూషనుకు వెళ్లినా కొందరు పిల్లలతో తల్లిదండ్రులే హోం వర్క్ చేయించాల్సి వస్తోంది. దీంతో కొన్ని చోట్ల తల్లిదండ్రులే చదువుకుంటున్నారేమో అనిపించే పరిస్థితి ఉంది

## గాడి తప్పిన పాఠశాల వ్యవస్థ.. తరగతుల నిర్వహణ !

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కొన్ని ప్రైవేట్ బడుల్లో ఒక్కో తరగతిలో 40-50 మంది విద్యార్థులు ఉంటారు. ఒక్క ఉపాధ్యాయుడే వారందరికీ బోధించాల్సి ఉంటుంది. ఒక పీరియడ్‌లో (45-55 నిమిషాలు) వారందరిపైనా వ్యక్తిగత పరిశీలన దృష్టి పెట్టడం ఏ ఉపాధ్యాయుడికైనా అసాధ్యం. విద్యావేత్తల సూచన ప్రకారం, గత అనుభవాల ప్రకారం గరిష్ఠంగా 15- 20 మంది విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు చక్కగా పర్యవేక్షించగలడు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న తరగతుల్లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన లభించదు! దీనివల్ల విద్యార్థులు విద్య, పాఠ్యాంశాల పరమార్థం తెలుసుకోకుండా మొక్కుబడి చదువుల అభ్యాసానికే పరిమితం అవుతారు.

## విద్య మౌలిక హక్కు

విద్య ప్రతి మనిషికి మౌలిక హక్కు. ఆర్థిక భాషలో దీనిని Merit Good అని పిలుస్తారు. ఇది ధనికులు, పేదలు అనే అంతరంతో నిమిత్తం లేకుండా ప్రతి పౌరునికి, పిల్లాడికి అందుబాటులో ఉండాలి, కానీ ఇప్పుడు ఈ నాణ్యమైన మంచి విద్య అనే మౌలిక హక్కు కేవలం ధనికుల సొత్తుగా మారిపోతోంది!

## తక్షణ చర్యలు అవసరం

దేశ విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టకపోతే అక్షరాస్యత పెరగడం ఆగిపోతుంది. అక్షరాస్యత తగ్గడం వల్ల నిరుద్యోగం, పేదరికం, నేరాలు పెరుగుతాయి. ఇప్పటికే నిరుద్యోగం దేశంలో పెద్ద సమస్యగా ఉంది. నాణ్యమైన విద్య లేకపోతే యువతకు ఉద్యోగాలు లభించడం మరింత కష్టమవుతుంది. విద్యా ప్రమాణాలు తగ్గడానికి, నేరాల పెరుగుదలకు మధ్య సంబంధం ఉంటుంది. దీన్ని పాలకులు, తల్లిదండ్రులు, స్కూళ్ల యాజమాన్యాలు గుర్తుంచుకోవాలి. భవిష్యత్తు తరానికి ఉజ్వల భవితను అందించడానికి తమ వంతుగా నాణ్యమైన విద్యను అందించాలి.

## ప్రభుత్వ నిర్లక్ష్యం....మీడియా దౌర్భాగ్యం!


దురదృష్టవశాత్తు ప్రభుత్వం, మీడియా ఈ సమస్యపై శ్రద్ధ చూపడం లేదు! మరోవైపు టీనేజీ విద్యార్థులను అనవసరమైన, అనారోగ్యకరమైన కార్యకలాపాల్లో నిమగ్నం చేయడానికి సోషల్ మీడియా ప్రయత్నిస్తున్నది. ఈ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, టీచర్ల నియామకం, నాణ్యమైన బోధన పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ పాఠశాలల స్వేచ్ఛను నియంత్రించాలి. ప్రతి విద్యార్థికి నాణ్యమైన మానవీయ విలువలు, నైతిక విలువలు కలిగిన, ఉపాధి కల్పనకు భరోసా కల్పించే విద్యను అందుబాటులోకి తేవాలి.

## ఇస్లామ్ విద్యకు ఇచ్చిన ప్రాముఖ్యత.. ముస్లింల బాధ్యతలు

ఇస్లాంలో విద్యకు చాలా ప్రాధాన్యత ఉంది. "విద్యార్జన ప్రతీ స్త్రీ, పురుషునికి విధి" అన్నారు ప్రవక్త ముహమ్మద్ (ఇబ్నె మాజా)

విద్య అనేది కేవలం భౌతిక సుఖాల సంపాదన కోసం కాదని అందరూ తెలుసుకోవాలి. అది వ్యక్తిత్వ వికాసం, సామాజిక శ్రేయస్సు, ఆధ్యాత్మిక అభివృద్ధికి మార్గమని గ్రహించాలి. ఈ కాలంలో ముస్లింలు తమ ధనం, శక్తిని వివాహ వేడుకలు మొదలైన వాటిలో వృధా చేయకుండా నాణ్యమైన విద్యాసంస్థల ఏర్పాటు వైపుగా దృష్టిని మళ్లించాలి. లాభం కోసం కాకుండా నిజమైన విద్యను అందించే స్కూళ్లు స్థాపించాలి. ముస్లింలు ఏర్పరచిన ప్రాచీన విద్యా కేంద్రాలైన అల్-కరావీన్ (మొరాకొష్), అల్-అజ్హర్ (ఈజిప్ట్) లాంటి విద్యా సంస్థల స్ఫూర్తిని పునః స్థాపించాలి. ఇవి కేవలం ముస్లింల కోసమే కాదు, ఇతర మతస్థులకూ జ్ఞాన కేంద్రాలుగా నిలిచాయి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




**గుండెపోటు అనగానే వృద్ధుల సమస్య అనుకునే రోజులు ఇప్పుడు పోయాయి.** ఈ మధ్యకాలంలో 20 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువతే గుండెపోటుతో మరణిస్తున్న సంఘటనలు బహుళం అయ్యాయి. ఎన్నో కలలు, ఆశయాలతో జీవిత పయనం మొదలై, గమ్యం చేరకముందే నిలిచిపోయే ఈ కథలు భయానక యథార్థంగా మారుతున్నాయి. మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ కుమారుడు వైష్ణవ్ 21వ ఏటనే గుండెపోటుతో మృతి చెందాడు. తిరుమల తిరుపతి దేవస్థానం ఇవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి తన పెళ్లి కార్డులు పంచుతూ గుండె పోటుకు గురై ప్రాణాలు వదిలాడు. సినీ నటుడు తారకరత్న చిత్తూరులో నారా లోకేష్ పాదయాత్రకు హాజరై ఒక్కసారిగా కుప్ప కూలి గుండెపోటుకు గురయ్యాడు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్ష రాస్తున్న విద్యార్థి గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. హైదరాబాద్ పాతబస్తీలో కొందరు యువకులు కబడ్డీ అడుతుండగా అందులో ఒక యువకుడు గుండెపోటు (Heart attack)కు గురై మృతి చెందాడు, ఇలా ఒకరిద్దరు కాదు పెద్ద సంఖ్యలోనే యువకులు గుండెపోటుకు గురౌతున్నారు. యుక్తవయస్సులోనే వీరి గుండెలు నీరసించి పోతున్నాయి.

## గణాంకాలు ఏమంటున్నాయి?

జన్యుపరమైన కారణాల కంటే ఎక్కువగా మారుతున్న జీవన విధానం వల్ల ఇలాంటి పరిస్థితి ఎదురౌతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో భారతదేశంలో సుమారు ఏడు కోట్ల మంది గుండెవ్యాధులతో చికిత్స పొందుతుండగా వారిలో రెండున్నర కోట్ల మంది 35 సంవత్సరాల లోపు వారు ఉన్నట్లు స్పష్టం అయింది. ఇక అనధికారికంగా అంతకు రెట్టింపు మంది యువకులు గుండెపోటు, హృద్రోగ సమస్యలతో సతమతం అవుతున్నారు. ప్రస్తుతం వివిధ కారణాలతో 40 సంవత్సరాల లోపువారు చనిపోతుండగా వారిలో గుండెపరమైన సమస్యలతో చనిపోతున్న వారు 30 శాతం వరకు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

❖ నిత్యం వ్యాయామం చేస్తున్న వారు కూడా గుండెపోటుకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి కారణం మారుతున్న సమాజంలో యువత ఆహారపు అలవాట్లు, ఒత్తిడిలు అని తెలుస్తోంది. ప్రధానంగా యువతకు గుండెపోటు రావడానికి అయిదు కారణాలు ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు.

❖ అందులో ముందు వరసలో మానసిక ఒత్తిడి కారణంగా నిలిచింది. విద్యారంగంతో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కూడా ఇటీవల కాలంలో ఒత్తిడి పెరిగింది. విద్యార్థి దశ నుంచి 95 శాతానికి మించి మార్కులు సాధించాలన్న ఒత్తిడి పెరిగింది.

❖ భారతదేశంలో ప్రతి నాలుగు గుండెపోటు మరణాల్లో ఒకటి యువతరానిదే.

❖ 2023 అధ్యయనాల ప్రకారం, 25-40 ఏళ్ల మధ్యవయస్సు గల వారిలో గుండె సంబంధిత మరణాలు గత పదేళ్లలో రెట్టింపయ్యాయి.

❖ COVID-19 అనంతరం ఈ సంఖ్య మరింత వేగంగా పెరిగినట్టు వైద్య నిపుణుల విశ్లేషణ.

## ఎందుకు ఇలా జరుగుతోంది?

### 1. జీవనశైలిలో మార్పులు

➢ ఉద్యోగ, విద్య, సామాజిక పోటీ పెరిగిన నేపథ్యంలో యువత నిత్యం ఒత్తిడిలో ఉంటోంది.

➢ విశ్రాంతి లేకుండా పని చేయడం, రాత్రి నిద్రలో అంతరాయం, అనియమిత భోజనాలు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

### 2. ఆహారపు అలవాట్లు

➢ రెడీమేడ్, ప్రాసెస్డ్, డీప్ ఫ్రైడ్ ఆహారం అధికంగా తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతోంది. అధిక కొవ్వు, చక్కెర తినే అలవాట్లు గుండె సమస్యలకు దారి తీస్తున్నాయి.

➢ జంక్ ఫుడ్ ప్రేమ, ఫిజికల్ యాక్టివిటీ లేకపోవడం కూడా యువ గుండెలపై భారంగా మారుతోంది.

### 3. ఆల్కహాల్, ధూమపానం వ్యసనాలు

"స్ట్రెస్ రిలీఫ్" అని ఊహించి యువత వీటిపై ఆధారపడుతుంది. కానీ ఇవి గుండెపోటుకు నేరుగా కారణాలు.

### 4. స్మార్ట్‌ఫోన్, స్క్రీన్ డిపెండెన్సీ

రాత్రంతా ఫోన్ చూసి నిద్ర తగ్గించుకోవడం వల్ల నిద్రలేమి - ఇది గుండెపోటుకు ప్రాథమిక కారణాల్లో ఒకటి.

### 5. జెనెటిక్స్ నిర్లక్ష్యం

కుటుంబంలో గుండె వ్యాధుల చరిత్ర ఉన్నా, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ప్రమాదమే.

## మానసిక ఒత్తిడి- మౌన హంతకుడు

మనసు మీద ఒత్తిడి పడితే అది నేరుగా హృదయంపై ప్రభావం చూపుతుంది. నిరంతర పోటీ, ఎదగాల్సిన గమ్యం, ఉద్యోగ భద్రత లేని పరిస్థితులు యువతను మానసికంగా కొల్లగొడు తున్నాయి. దీనివల్ల బ్లడ్ ప్రెషర్, శరీర పీడనం, చివరికి గుండె సమస్యలు ఎదురవుతాయి.

## పరిష్కార మార్గాలు - ఇంకా ఉన్న జీవితం పట్ల బాధ్యత

### ఆరోగ్యకర జీవనశైలి

◆ ఉదయం లేవగానే నడక అలవాటు చేసుకోవాలి.

◆ రోజూ కనీసం 30 నిమిషాలు శారీరక చలనం ఉండాలి.

### ఆహార నియమాలు

◆ తక్కువ నూనె, తక్కువ ఉప్పు, ఎక్కువ కూరగాయలు, ఫలాలు తీసుకోవాలి.

◆ రెగ్యులర్‌గా వాటర్ ఇంటేక్, షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ ట్రాక్ చేసుకోవాలి.

### మానసిక ఆరోగ్యం

◆ ధ్యానం (జిక్ర్), మెడిటేషన్ వంటి మార్గాలు ఒత్తిడిని తగ్గించ గలవు. "తెలుసుకోండి! దైవ సంస్మరణ ద్వారానే హృదయాలు నెమ్మదిస్తాయి." (ఖుర్ఆన్ 13: 28)

◆ అవసరమైతే సైకాలజికల్ కౌన్సిలింగ్ తీసుకోవడంలో ఎలాంటి హీనభావన ఉండకూడదు.

◆ నిద్రకు ఉపక్రమించే ముందు కాస్సేపు పవిత్ర గ్రంథ పారాయణం చేయాలి.

### ప్రొఫెషనల్ హెల్త్ చెకప్

ఏడాదికోసారి పూర్తిస్థాయి హార్ట్ చెకప్, ఇసిజి, లిపిడ్ ప్రొఫైల్, బిపి పరీక్ష చేయించుకోవాలి.

### సమాజానికి సందేశం:

ఈ రోజు గుండెపోటుతో మరణిస్తున్న వ్యక్తి పక్కింటి యువకుడు కావచ్చు, రేపు మన కుటుంబసభ్యుడే కావచ్చు.
గుండె ఆరోగ్యం అంటే కేవలం "నొప్పి వచ్చాక" ఆసుపత్రికి పరుగెత్తడం కాదు, నొప్పి రాకుండా జాగ్రత్తపడటం.
గుండె సమస్యలు వృద్ధాప్యంలో వచ్చే సమస్యలే అన్న మిథ్యా భావనను మారుస్తున్నది ఈ దారుణ వాస్తవం. ఈ రోజు యువత మూడో తలుపు తట్టకముందే ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. "ఒక క్షణం ఆలస్యం- ఒక జీవితాన్ని పోగొట్టుతుంది" అనే మాటను మర్చిపోకండి.
మీ జీవితం మీ చేతుల్లో ఉంది.
మీరు లేకపోతే, మీ కలలు, మీ కుటుంబం, మీ బాధ్యతల్ని ఎవరు నెరవేర్చగలరు?

### ముగింపు

మన శరీరం మర్చిపోలేని యంత్రం. దాన్ని నువ్వు నిర్లక్ష్యం చేస్తే, అది నిన్ను మానవత్వంతో స్పందించనివ్వదు.
ప్రతి రోజూ ఒక్క అడుగు ఆరోగ్యంగా సాగితే, ఎన్నో సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించవచ్చు.
"హృదయం జీవన స్పందన యంత్రం- దాన్ని ప్రేమించు, కాపాడుకో!"




**- షరీఫా, విజయవాడ**

**చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్(స) ఇస్లామీయ రాజ్యసంస్థాపన (ఖిలాఫత్) బీజాన్ని నాటారు.** ప్రవక్త(స) తర్వాత అబూబకర్ సిద్దీఖ్(రజి), ఉమర్(ర), హజ్రత్ ఉస్మాన్(ర), ఆ తర్వాత అలీ(ర) ప్రజా ప్రతినిధులుగా పరిపాలన సాగించారు. వీరి పరిపాలనా కాలంలో ప్రజలందరూ ఎటువంటి భేదభావాలు లేకుండా సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ రంగాలలో సమతూకం పాటించారు. "దేశం దేవునిది, దేశవాసులు దేవుని పాలితులు" అనే ప్రప్రథమ మౌలిక సూత్రంగా పాలించి మానవ చరిత్రలోనే సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. పాలకులు దైవానికి భయపడాలని సచ్ఛీలత, జవాబుదారీతనం, వాగ్దాన పాలన ప్రతి రాజ్యపాలకునికి ఉండాలి అనేది ఇస్లామీయ చట్టంలోని మౌలిక సూత్రం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజల అభీష్టం, అభిమతం మేరకు, ప్రజాభిప్రాయం తమకు అనుకూలంగా రానంత వరకు ఎవరూ అధికారం కోసం ప్రయత్నించరాదు అనేది మొదటి మౌలిక సూత్రం.

**రెండవ ముఖ్య సూత్రం** : పరిపాలన సలహా సంప్రదింపుల ప్రకారం మాత్రమే సాగాలి. ఈ సలహాలను ఇచ్చేవారు సత్యసంధులుగా, ప్రతి విషయంలోనూ దైవభీతి పరులుగా ఉండాలి. ప్రభుత్వానికి, ప్రజలకు విశ్వసనీయతతో కూడిన చక్కని సలహాలు ఇచ్చేవారుగా ఉండాలి.

**మూడవ ముఖ్య సూత్రం** : ప్రజలకు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడి చేసే అధికారం ఉంటుంది. ఇటువంటి స్వేచ్ఛ ఉన్నప్పుడే పాలకుల తప్పులను ప్రజలు నిర్భయంగా, నిర్మొగమాటంగా నిలదీయగలుగుతారు.

**నాల్గవ అంశం** : పాలకులు తమ పరిపాలన గురించి అటు దైవానికి, ఇటు ప్రజలకు జవాబుదారులుగా ఉండాలి. అంటే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి.

**ఐదవ సూత్రం** : ప్రభుత్వ ధనాగారం (బైతుల్ మాల్) దేవుని సొత్తు. ప్రభుత్వ ధనాగారం నుండి ఖర్చు పెట్టే ప్రతీ పైసాకు పాలకుడే జవాబుదారుడు. ప్రభుత్వం ఖర్చు పెట్టే ఖర్చులను గురించి ప్రశ్నించే అధికారం, హక్కు ప్రజలకు ఉంది.

**ఆరవ అంశం** : సాధారణ పౌరుడు మొదలుకొని ప్రభుత్వాధినేత వరకు ఒకే విధమైన చట్టం, ఒకే విధంగా అమలు జరగాలి. అప్పుడే సంపూర్ణ సమానత్వం లభిస్తుంది.

**ఏడవ ముఖ్య సూత్రం :** దేశం, వంశం, వర్ణం, భాష, తెగ, జాతి, కుటుంబాల ప్రాతిపదికన ఎవరికీ, ఎవరిపై ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వటం జరగదు.

ఈ మౌలిక సూత్రాల ప్రకారమే మొదటి నలుగురు ఖలీఫాలు పరిపాలన చేశారు. ప్రజాస్వామ్యపు విలువలతో స్వర్ణ యుగాన్ని తలపింపజేశారు. ఒక రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న హజ్రత్ ముఆవియా సైనిక శక్తిని ఉపయోగించి రాజ్యాన్ని చేజిక్కించుకున్నాడు. దీంతో ఖిలాఫత్ (దైవప్రాతినిధ్య పరిపాలన) పటాపంచలయ్యింది. తండ్రి మరణానంతరం ముఆవియా కుమారుడు యజీద్ తనకు తానుగా రాజుగా ప్రకటించుకుని గద్దెనెక్కాడు. యజీద్ బలవంతపు రాజరికానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ప్రియులంతా ఎదురు తిరిగారు. ఈ ఉద్యమానికి చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్(స) ముద్దుల మనవడు మహనీయ హుసైన్(ర) నాయకత్వం వహించారు. యజీద్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న హుసైన్(ర)కు "మేము మీకు మా పరిపూర్ణ సహకారాన్ని అందించి మా నాయకునిగా ఎన్నుకుంటాము" అని వ్రాసిన కూఫా వాసుల ఉత్తరాల వల్ల యజీద్‌ను కలవటానికి తన అనుచరులు, కుటుంబీకులతో కలిసి రాజధాని కూఫాకు బయలుదేరారు ఇమామ్ హుసైన్(ర). అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర) "నీ తండ్రిని, నీ సోదరుణ్ణి దగా చేసిన వారు నిన్ను కూడా దగా చేస్తారు. కాబట్టి నీవు నా మాట విని ఇక్కడే ఉండిపొ"మ్మని ఎంతగా బలవంతం చేసినా వెనక్కి మరలలేదు హుసైన్(ర). కానీ మార్గమధ్యంలోనే కర్బలా అనే చోట యజీద్ సైన్యం ఇమామ్ పరివారాన్ని అడ్డగించింది. ఇమామ్ హుసైన్(ర) తాను కేవలం చర్చల కోసమే రాజధానికి వెళుతున్నాను అని ఎంతగా నచ్చచెప్పినా ఇమాం మాటల్ని ఖాతరు చెయ్యక "యజీద్‌ను రాజుగా గుర్తించాలి, లేదంటే సమరమే" అని యజీద్ సైన్యాధిపతి కయ్యానికి కాలు దువ్వాడు. అన్యాయానికి, దౌర్జన్యానికి తలవంచక ప్రజాస్వామ్య పరిరక్షణకై గత్యంతరం లేక యుద్ధానికి సిద్ధమయ్యారు. కానీ ఇమామ్ హుసైన్(ర) యుద్ధ సంకల్పంతో రాలేదు కాబట్టి సరైన ఆయుధాలు లేవు. అటు సైన్యం వైపు చూస్తే అంతా కూఫా వారే ఉన్నారు. మీరంతా ఎందుకు వచ్చారు? అని అడగ్గా మీతో యుద్ధానికి అని సమాధానం చెప్పారు. కూఫా వారు పంపిన ఉత్తరాలు ఒక్కొక్కటి తీసి చదివి 'మీరే కదా నన్ను రమ్మని, ఇప్పుడు నాతో యుద్ధం చేయటానికి వచ్చారా?" అని ప్రశ్నించారు ఇమామ్ హుసైన్(ర). ఇరువర్గాల భీకర పోరాటంలో ఇమామ్ పరివారం శక్తివంచన లేకుండా పోరాడుతూ ఒక్కొక్కరూ నేలకొరిగారు.

## యౌమె ఆషూరా ప్రాముఖ్యత

ముహర్రం నెల పదో తేదీని ఆషూరా అంటారు. అష్ అంటే పది అని అర్థం. యౌమె ఆషూరాకు ఎంతో చారిత్రక ప్రాముఖ్యత ఉంది. దైవప్రవక్తలకు యౌమె ఆషూరాకు ఎంతో అవినాభావ సంబంధం ఉంది. మూసా ప్రవక్త ఫిరౌన్ సైన్యాల నుండి విముక్తి పొందిన రోజు కూడా ఇదే కావటం విశేషం. ఇమామ్ హుసైన్ ధర్మరక్షణకై ప్రాణత్యాగం చేసిన రోజు కూడా యౌమె ఆషూరానే. కానీ నేటి ముస్లిం సమాజం ఒక్క కర్బలా దుర్ఘటననే తలచుకుంటూ ఈ నెలనే సంతాప నెలగా భావించటం బాధాకరం. ముహర్రమ్ నెల ఎన్నో విశిష్టతలతో, శుభాలతో గుర్తింపు పొందినదిగా గుర్తించవలసిన అవసరం ఉంది. "యదార్థం ఏమిటంటే ఆకాశాన్ని, భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటి నుండీ, మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరైన గణన పద్ధతి. కనుక ఈ నాలుగు మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి" (తౌబా : 36) అని దివ్య ఖుర్ఆన్ బోధిస్తుంది. ఖుర్ఆన్, హదీసు గ్రంథాలు కూడా ముహర్రమ్ నెలను పవిత్ర నెలగా పరిగణించటం విశేషం. అధికారమే పరమావధిగా, స్వార్థమే శ్వాసగా, ధార్మిక, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తూ రాజరికపు వ్యవస్థను పెంచి పోషించే యజీద్ లాంటి రాజకీయ వారసుల్ని ఏరివేయాలని, సమస్త మానవాళికి స్వేచ్ఛను, సమానత్వాన్ని, శాంతిని, హక్కులను, అవకాశాలను ప్రసాదించగల మానవీయ విలువలతో కూడిన ధార్మిక ప్రజాస్వామ్య వ్యవస్థను పునః స్థాపనకు కృషి చేయాలనేదే ముహర్రమ్ నెల మనకు అందించే సందేశం. ఇమామ్ హుసైన్(ర) త్యాగానికి గుర్తుగా మనం కూడా ప్రజాస్వామ్య పరిరక్షణా స్ఫూర్తి పొందే సద్బుద్ధిని ప్రసాదించమని సృష్టికర్త అల్లాహ్‌ను వేడుకుందాం. (ఆమీన్)

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గేటురాయి
వారపత్రిక



# వివాహ బంధమే అసలైన జీవన మార్గం!

యండి. ఉస్మాన్ ఖాన్

**ఇటీవలి** కాలంలో వివాహేతర సహజీవన బంధాలపై దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. పెళ్లి చేసుకోకుండానే కలిసి జీవించడాన్ని స్వేచ్ఛగా భావిస్తే, అది సమాజం, కుటుంబ వ్యవస్థలకు ముప్పుగా పరిణమిస్తుందా? అనే ప్రశ్న తెరపైకి వస్తోంది. కొందరు దీన్ని సమర్థిస్తూ, మానవ సంబంధాల ప్రామాణిక నైతిక నిర్మాణాన్ని ప్రశ్నించడానికి సిద్ధమవుతున్నారు.. అయితే, ఇది వ్యక్తిగత నిర్ణయం అనిపించినప్పటికీ దీని ప్రభావం సమాజంలోని పునాది వ్యవస్థనే ఢీకొనే ప్రమాదం ఉంది.

భారతీయ సంస్కృతి వివాహాన్ని ఒక వ్యక్తిగత నిర్ణయంగా మాత్రమే కాకుండా, రెండు కుటుంబాల మధ్య ఏర్పడే సామాజిక ఒప్పందంగా కూడా పరిగణిస్తుంది. ఇది జీవిత కాల పయనానికి శాశ్వత ప్రతిజ్ఞగా ఉంటుంది. ఈ బంధంలో గౌరవం, నిబద్ధత, పరస్పర బాధ్యత వంటి మూల విలువలు ఉంటాయి. కానీ సహజీవనం అనేది తాత్కాలిక అంగీకారంతో మొదలై, తక్కువ బాధ్యతతో నడిచే ఓ అస్థిరమైన జీవన పద్ధతి. ఈ బంధంలో స్థిరమైన నిబద్ధత ఉండదు. ఈ బంధంలో ఉన్నవారికి ఎప్పుడైనా విడిపోవచ్చన్న భావన ఉండటం వల్ల, అది ప్రేమను స్థిరమైన భావంగా కాకుండా, తాత్కాలిక అవసరంగా మారుస్తుంది.

### తాత్కాలిక బంధాల వలన..

ప్యూ రీసెర్చ్ సంస్థ 2021 నివేదిక ప్రకారం, వివాహితులలో 78 శాతం మంది తమ బంధంపై భద్రతా భావన కలిగి ఉన్నారు. కానీ సహజీవన బంధాల్లో ఈ నమ్మకం 55 శాతం మేరకే ఉంది. నిపుణుల అంచనాల ప్రకారం తాత్కాలికంగా ఏర్పడే బంధాల్లో స్థిరత్వం, గౌరవం, భద్రత వంటి అంశాలు మిగిలిన జీవితం మీద ప్రభావం చూపుతాయి. ఇందులో భార్యాభర్తల మధ్య ఉండే అన్యోన్యత, సామరస్యత కొరవడుతుంది. పిల్లలపై ఇది తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ బంధాల్లో పుట్టి పెరిగే పిల్లలకు కుటుంబ అనుభవం లభించదు.. తల్లిదండ్రుల మధ్య విభేదాలవల్ల పిల్లల్లో అస్థిరత, ఒంటరితనం, విశ్వాస లోపం పొడసూపి అవి విద్యాభ్యాసం మీద ప్రభావం వంటి దుష్పరిణామాలు ఏర్పడతాయి.. ఈ బంధాల్లో పెరిగిన పిల్లల్లో మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువగా నమోదయ్యాయని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. భారత దేశ భవిష్యత్తు సుస్థిరంగా ఉండాలంటే, మనం పిల్లలకు భద్రతతో కూడిన జీవన పునాది అందించాలి. అది పూర్తిస్థాయి కుటుంబం నుంచే వస్తుంది.

### సహజీవనం చట్టబద్ధమైనా...

ఇక చట్టపరంగా చూస్తే, సహజీవనం తప్పుకాదని కోర్టులు పలు సందర్భాల్లో అభిప్రాయపడ్డాయి. కానీ అది చట్టబద్ధతే తప్ప, సామాజిక లేదా నైతిక అంగీకారం కాదు.

భారత న్యాయవ్యవస్థ సహజీవన బంధాన్ని 'లెజిటిమేట్'గా గుర్తించినా, అదే బంధాన్ని ఆదర్శంగా, శ్రేష్ఠంగా ప్రమాణీకరించలేదు. కొన్ని సందర్భాల్లో మహిళల హక్కులను కాపాడేందుకు మాత్రమే ఈ బంధాన్ని ఆమోదించింది. కుటుంబ కోర్టుల్లో, పిల్లల సంరక్షణ విషయంలో, ఆస్తి హక్కుల విషయంలో సహజీవన బంధాల చట్టపరమైన పరిమితి స్పష్టంగా తెలుస్తుంది. భారతీయ సంస్కృతి, ధార్మిక వ్యవస్థ సహజీవనాన్ని సమర్థించలేదు.. పైగా అన్ని ప్రధాన మతాలు నైతిక జీవనశైలికి వివాహ బంధం ద్వారానే కట్టుబడి ఉండాలన్న భావనను ప్రతిపాదించాయి. సహజీవనం అనేది ఈ బంధాన్ని ధ్వంసం చేసే మార్గం.

ఇది ఇంద్రియానుభూతిపై ఆధారపడి, బాధ్యతల నుండి తప్పుకునే విధానంగా ఉంది.

**ఇది అనైతికతను ప్రోత్సహించే ముసుగు..**

భారతీయ కుటుంబ వ్యవస్థ అనేది ప్రపంచంలోని అత్యంత బలమైన సామాజిక నిర్మాణాలలో ఒకటి. ఒకే ఇంట్లో మూడు తరాలూ కలిసి నివసించగలిగే సామరస్యం ఇందులో ఉంది. చిన్నారులకు, యువతకు, వృద్ధులకు ఇదొక భద్రతా వ్యవస్థ. వివాహేతర బంధాలు ఈ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తాయి. యువత ప్రేమను గౌరవించాలి. కానీ ప్రేమ పేరుతో బాధ్యతను విస్మరించి, తాత్కాలిక అవసరంగా ఒకరి మీద ఒకరు ఆధారపడే పరిస్థితిని బలపరచడం సమాజాన్ని నైతికంగా సంక్షోభంలోకి నెట్టే చర్య. బాధ్యత తీసుకునే ధైర్యం ఉన్నప్పుడే ప్రేమకు విలువ ఉంటుంది. ప్రేమను శాశ్వతమైన బంధంగా మలచే ప్రయత్నమే వివాహం. అదే జీవన విధానంగా నిలవాలి. సహజీవనం అనేది స్వేచ్ఛ పేరుతో అనైతికతను ప్రోత్సహించే ముసుగు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దీర్ఘకాలికంగా కలిసి జీవించదగిన మార్గం కూడా కాదు. భారతీయ విలువలు, కుటుంబ నిర్మాణం, మానవ సంబంధాల్లో స్థిరత్వం ఇవన్నీ బలపడాలంటే మనం వివాహ వ్యవస్థను మరింతగా సమర్థించాలి. ఒక బంధం నిలవాలంటే అది నైతికంగా, చట్టపరంగా, మానవీయంగా స్థిరంగా ఉండాలి. అందుకే సహజీవనం కాదు, వివాహ బంధమే అసలు సిసలైన జీవన మార్గం.

# అధికులు అక్కడ అధములవుతారు

**“వారు తమ ప్రభువు వాక్యాలను నమ్మకుండా తిరస్కరించినవారు. ఆయన సాన్నిధ్యంలో హాజరు కావలసి ఉన్నదనే విషయాన్ని విశ్వసించనివారు. ఇందువల్ల వారి కర్మలన్నీ వృధా అయి పోయాయి. ప్రళయదినం నాడు మేము వారికి (వారి కర్మలకు) ఏమాత్రం విలువనీయము.” (18: 105)**

సొసైటీలో సాధారణంగా ధనికులు, పాలకులు, అధికారులు, బలవంతులు, నాయకులు, నిపుణులకు, అసామాన్య శక్తి సామర్థ్యాలు కలవారికి మాత్రమే గౌరవాదరణలు లభిస్తాయి. పైగా వారిలో విశ్వాసం (ఈమాన్), నైతిక విలువలు లేకపోయినా సమాజంలో వారి హోదా అంతస్థులను బట్టి లోకంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. విశ్వాసులు నిజాయితీపరులు, సచ్ఛీలురైనప్పటికీ వారివద్ద సిరిసంపదలు, హోదా అంతస్తులు లేకపోతే వారికి లోకం ఎలాంటి విలువ ఇవ్వదు. కానీ ప్రళయం రోజున పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ప్రళయం రోజు దైవభీతిపరులకే ఆదరణ లభిస్తుంది.

ప్రళయం రోజు కర్మలను బట్టి మానవుల హోదా అంతస్తులలో తేడాలు ఉంటాయి. అంటే మానవుల విలువ వారి పాపపుణ్యాల ఆధారంగా నిర్ణయించబడుతుంది. ప్రపంచంలో ఎంతో గొప్పవాళ్ళుగా భావించబడినవారు, అహంకారులు ప్రళయదినాన అందరికంటే అధములుగా, నీచులుగా మారి నరక కూపంలో విసిరేయబడతారు. వారి పెద్దరికం, హోదా అంతస్తులు మట్టిలో కలసిపోతాయి. ఆ రోజున ఇలాంటి వారి పరిస్థితిని గురించి ఖుర్ఆన్ ఇలా అంటోంది.. “అయ్యో! .. ఈనాడు నా ఆస్తి నాకు ఏమాత్రం పనికి రాలేదే. నా అధికారమంతా అంతరించిపోయిందే” అని వాపోతాడు. (ఖుర్ఆన్-69:29)

ధర్మాన్ని పూర్తిగా ఆచరిస్తూ నీతిగా జీవించే వారు ఇక్కడ లోకుల గౌరవాదరణలకు నోచుకోలేకపోయినా, ప్రళయదినాన మాత్రం దేవుడు వారిని ఎంతో ఆదరిస్తాడు. మహాప్రవక్త (స) ఆ రోజు మానవుల పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: “బాగా వినండి! ఇహలోకంలో మస్తుగా తింటూ, త్రాగుతూ, భోగభాగ్యాలు అనుభవించినవారు పరలోకంలో ఆకలితో నకనక లాడుతుంటారు. నగ్నంగా ఉంటారు. వినండి. ఇహలోకంలో తమను ఎంతో గౌరవనీయులుగా చేసుకుంటున్న వారు నిజానికి తమను తాము అవమాన పరచుకుంటున్నారు. (ఈ యదార్థం పరలోకంలో తెలుస్తుంది). అలాగే ఇహలోకంలో (వినయం, అణకువ, ధర్మపరాయణతల కారణంగా) నిరాదరణకు గురయినవవారు నిజానికి తమనుతాము గౌరవనీయులుగా చేసుకుంటున్నారు. (దేవుని పట్ల ఈ వినయవిధేయతలే వారిని స్వర్గానికి చేర్చుతాయి.)”

“ప్రళయం రోజు బాగా బలిసిన ఓ లావుపాటి పెద్దమనిషిని తీసుకురావడం జరుగుతుంది. కాని దేవుని వద్ద అతనికి దోమరెక్కంత విలువ కూడా ఉండదు”.

**– తహూరా సిద్దీఖా**




## హజ్ యాత్రకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత హజ్ కమిటీ, హజ్ 2026 యాత్ర కోసం దరఖాస్తుల స్వీకరణను అధికారికంగా ప్రారంభించింది. జూలై 31, 2025 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చని మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దరఖాస్తు చేసుకునే వ్యక్తులు దరఖాస్తు ఫారమును సమర్పించే ముందు మార్గదర్శకాలు, అండర్ టేకింగ్‌లను పూర్తిగా చదవాలి. ప్రత్యేకంగా, జూలై 31, 2025 లోపు జారీ చేయబడిన మిషన్-రెడబుల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్ట్‌కు కనీసం డిసెంబర్ 31, 2026 వరకు వాలిడిటీ ఉండటం తప్పనిసరి అని వివరించారు. గత వారం జరిగిన సమీక్షా సమావేశంలో, అల్ప సంఖ్యాకుల వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. హజ్ 2025 భారతీయ యాత్రికుల కోసం ఇప్పటివరకు నిర్వహించిన అత్యుత్తమ యాత్రగా నిలిచిందన్నారు. దరఖాస్తులు hajcommittee.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. మరణం, ఎమర్జెన్సీ మినహాయించి యాత్రను క్యాన్సిల్ చేసుకుంటే జరిమానా తప్పదని కూడా హజ్ కమిటీ స్పష్టం చేసింది.

## గుండెపోటు మరణాలు.. కొవిడ్ వ్యాక్సిన్..

కొవిడ్ వ్యాక్సిన్‌కు, గుండెపోటు మరణాలకు ఏదైనా సంబంధం ఉందా? అనే విషయాన్ని తేల్చడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. తాజాగా నిపుణుల కమిటీ అధ్యయనం పూర్తి చేసింది. అధ్యయనంలో తేలిన విషయాన్ని వెల్లడించింది. నెలరోజుల్లో 20 మందికి పైగా యువకులు గుండెపోటుతో మరణించడానికి కొవిడ్ వ్యాక్సిన్ కారణం కావచ్చనే అనుమానాలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల వ్యక్తం చేశారు. దీంతో ఆకస్మిక మరణాలకు, కొవిడ్ టీకాలకు సంబంధం లేదని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. యువకుల ఆకస్మిక గుండెపోటు మరణాలకు 'లాంగ్ కొవిడ్' కారణం కావచ్చనడానికి ప్రస్తుత గణాంకాలు ఏమాత్రం సపోర్ట్ చేయడం లేదని తెలిపింది. కొవిడ్‌కు, ఆకస్మిక గుండెపోటు మరణాల మధ్య ఎలాంటి సంబంధమైనా ఉందా? అనే అంశంపై అవగాహనకు ప్రపంచవ్యాప్తంగా ప్రచురితమైన పలు రీసెర్చ్ పేపర్లను తాము అధ్యయనం చేసినట్టు నిపుణుల కమిటీ తెలిపింది.

## వక్ఫ్ ఆస్తులకు పోర్టల్.. నోటిఫై చేసిన కేంద్రం




దేశంలో ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహించేందుకు, అభివృద్ధి చేసేందుకు, వక్ఫ్‌కు మరింత సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం ప్రత్యేక పోర్టల్, డేటాబేస్ ద్వారా వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, ఆడిట్, అకౌంట్ల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చిన 2025, వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపరిచిన 1995 నాటి చట్టంలోని సెక్షన్ 108బీ ప్రకారం ఈ నిబంధనలు తీసుకువచ్చినట్టు కేంద్రం పేర్కొంది. ఆయా నిబంధనల అమలు, పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖలోని సంయుక్త కార్యదర్శికి అప్పగించారు. వక్ఫ్ పోర్టల్ సహా డేటాబేస్‌కు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు, కేంద్రంతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు, సహాయకారిగా ఉండేందుకు వీలుగా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఓ నోడల్ అధికారిని నియమించాలి. ఈ అధికారి రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాను కలిగి ఉండాలని కేంద్రం వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించే నోడల్ అధికారి.. తన పరిధిలోని వక్ఫ్ ఆస్తులను గుర్తించి జాబితాను అధికారికంగా ప్రచురించాలి. అనంతరం 90 రోజుల్లో దీనిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పోర్టల్, డేటాబేస్లపై ముతవల్లికే నియంత్రణ ఉంటుంది. అయితే, జిల్లా కలెక్టర్‌కు కూడా పోర్టల్, డేటాబేస్ యాక్సస్ ఉంటుంది.

సర్వత్రా

## గాజాలో తీవ్రతరమైన మానవతా సంక్షోభం

గాజాలో తీవ్రమైన మానవతా సంక్షోభంపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. అమాయక ప్రజల మరణాలను ఆయన ఖండించారు. ఇస్రాయీల్ సైన్యం బెదిరింపులకు భయపడి దాదాపు 30 వేల మంది ప్రజలు భద్రత లేకుండా తమ గూడు వదిలి పారిపోవాల్సి వచ్చింది. ఆశ్రయం, ఆహారం కోసం వచ్చిన వారిపై జరిగిన దాడుల్లో వేలమంది పాలస్తీనియన్లు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. గత కొన్ని రోజుల నుండి గాజాకు ఇంధన సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఇంక్యుబేటర్లు మూతపడ్డాయి, గాయపడిన వారిని, రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేని పరిస్థితి, నీటిని శుద్ధి చేయలేని దుస్థితి. ఐరాస, ఇతర సహాయ సంస్థలు నిర్వహిస్తున్న స్వల్ప సహాయ కార్యక్రమాలు కూడా ఆగిపోయే ప్రమాదం ఉందని గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవతా చట్టాల ప్రకారం పౌరులను గౌరవించాలి, రక్షించాలి, వారి అవసరాలను తీర్చాలని గుటెరస్ స్పష్టం చేశారు. ప్రజలకు సహాయం అందించేందుకు ఐరాస వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని, సురక్షితంగా పెద్ద ఎత్తున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇస్రాయీల్‌తో సహా అన్ని పక్షాలు అంతర్జాతీయ చట్టాలను పాటించాలని, వెంటనే శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించాలని, బందీలుగా ఉన్నవారిని షరతులు లేకుండా విడిచి పెట్టాలని మరోసారి ఆయన కోరారు.

## మూడో బిడ్డను కంటే రూ.12 లక్షలు!

ప్రజల మీద అత్యంత కఠినమైన ఆంక్షలు విధించి జనాభాను తగ్గించుకున్న చైనా.. ఇప్పుడు, పడిపోతున్న జనాభాను పెంచుకోవటానికి నానా తంటాలు పడుతోంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ముగ్గురిని కన్నా ఫర్వాలేదు.. డబ్బులిస్తాం అని ప్రకటిస్తోంది. రెండో బిడ్డను కన్న తల్లిదండ్రులకు 50 వేల యువాన్లు (దాదాపు రూ.6 లక్షలు), మూడో బిడ్డను కన్న వారికి ఏకంగా లక్ష యువాన్లు (రూ.12 లక్షలు) ఇస్తామంటూ చైనాలో ఓ రాష్ట్రమైన ఇన్నర్ మంగోలియా ప్రభుత్వం ప్రకటించటం అక్కడి పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. ఇదే బాటలో పలు స్థానిక ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పిల్లల్ని కనే జంటలకు నగదు ప్రోత్సాహకాలు, గృహ నిర్మాణానికి సబ్సిడీలను ప్రకటించాయి. జనానాల రేటు తగ్గటంతో చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతోంది. ఉద్యోగాలు, పనులు చేయగల వయస్కుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు ఇది తీవ్ర నష్టదాయక పరిణామం. ఇదే పరిస్థితి కొనసాగితే.. 2100 నాటికి చైనా జనాభా ఏకంగా 80 కోట్లకు పడిపోతుందని ఐక్యరాజ్యసమితి జనాభా అంచనాల విభాగం లెక్కగట్టింది.

## ఈరాన్‌పై అమెరికా-ఇస్రాయీల్ దాడులను ఖండించిన బ్రిక్స్




బ్రెజిల్‌లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈరాన్ అణు, సైనిక స్థావరాలపై అమెరికా-ఇస్రాయీల్ వైమానిక దాడులను ఖండిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. పహల్గామ్ ఉగ్రదాడులను ఖండిస్తూ బ్రిక్స్ సదస్సు సంయుక్త తీర్మానం వెలువరించింది. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దాడి అత్యంత అమానుషం అనే ప్రధాని నరేంద్ర మోడీ స్పందనతో ఏకీభవిస్తూ బ్రిక్స్ దేశాల రెండు రోజుల సమావేశంలో ఈ తీర్మానం వెలువరించారు. ఉగ్రవాదం నిర్మూలన విషయంలో ఏ అంతర్జాతీయ సంస్థ అయినా, ప్రామాణిక రీతిలో వ్యవహరించాలి. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు, డొంక తిరుగుళ్లు పనికిరావని పిలుపు నిచ్చారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, దీనికి ఏ దేశం ఏ రీతిలో సహకరించినా, అణువంత కూడా సహించరాదని తెలిపారు. బ్రిక్స్ వేదికగా భారతదేశం ఉగ్రవాద నిర్మూలనకు చేసిన ప్రతిపాదన సమర్థనీయం అని పేర్కొన్నారు. సీమాంతర ఉగ్రవాదం అడ్డుకట్టుకు, ఉగ్ర నిధుల చేరవేతకు కళ్లెం వేయాల్సి ఉందని సూచించారు. అమెరికా ఇటీవలి కాలంలో ఏకపక్షంగా టారీఫ్‌లు పెంచుతూ పోవడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరోక్షంగా ట్రంప్ నిర్ణయాలను తప్పు పట్టారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన సుంకాల విషయంలో ఇష్టారాజ్యం పరిస్థితిని దిగజారుస్తుందని తెలిపారు. ఇక ప్రపంచ స్థాయిలో తలెత్తుతున్న పలు సవాళ్ల నడుమ మరింత కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉందని కూడా అభిప్రాయపడ్డారు.

# జ్ఞానానికి ఔచితీ విజ్ఞతలు కూడా తోడైతే....

- ముహమ్మద్ వహీదుద్దీన్

**ఒక** గ్రామంలో షబ్బీర్ అనే బాలుడు ఉండేవాడు. అతను ఊరికి చివరగా ఉన్న ఒక చిన్న పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం. ఒకరోజు అతని ఉస్తాద్ (గురువు గారు) పాఠశాలలో పిల్లలకు ఇలా చెప్పారు :

అల్లాహ్ ప్రతి సృష్టిలో ఒక హిక్మత్ (యుక్తి, విజ్ఞత)ను ఉంచాడు. దానిని మనం ఖచ్చితంగా గమనించాలి.

ఈ మాటలు షబ్బీర్ మనసులో చెట్టులోని వేర్లులాగా నాటుకు పోయాయి. ఆ రోజు రాత్రి ఇంటికెళ్ళిన తర్వాత, అతను తన ఇంటి తోటలోని  ఓ చెట్టుపై ఒక సాలెపురుగును కనిపెట్టాడు. ఆ పురుగు మెల్లిగా తన చుట్టూ రేణువు తయారు చేస్తూ కనిపించింది.

షబ్బీర్‌కు చాలా ఆశ్చర్యం వేసింది. ఇది ఎందుకు ఇలా చేస్తోంది? ఇది బయటికి రావడానికి ఇన్ని కష్టాలు ఎందుకు పడుతోంది? అతను ఆలోచనలో పడిపోయాడు.

కొద్దిరోజుల్లో ఆ పురుగు పెద్దగా మారి, రెక్కలు రావడానికి శ్రమ పడింది. షబ్బీర్ ఆ దశను చూశాడు. అయితే అతని హృదయం చలించిపోయింది. కన్నీటి బిందువులు రాలాయి. ఎందుకు బాధపడుతుందో చూసి సహాయం చేయాలి అని గూడును ఓ చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు.

అయితే ఆ పురుగు బయటకు వచ్చినా, అది గాలిలో ఎగుర లేకపోయింది.  దాని రెక్కలు  బలహీనంగా ఉన్నాయి. అది కొద్దిసేపటికి ప్రాణం కోల్పోయింది.

షబ్బీర్ దుఃఖంలో మునిగిపోయాడు. మరుసటి రోజు పాఠశాలకు వెళ్ళి గురువు గారికి తను చేసిన పనిని వివరించాడు. గురువు గారు మెల్లిగా చిరునవ్వు నవ్వుతూ చెప్పారు :

"షబ్బీర్, అలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ హిక్మత్ (వివేచన, ఔచిత్యం)ను ఉంచాడు. సాలె పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడంలోనే దాని రెక్కలకు బలం వస్తుంది. నీ సాయం దయగా కనిపించవచ్చు, కాని అది సహాయం కాదు. అల్లాహ్ మనల్ని కొన్ని పరీక్షల ద్వారా బలోపేతం చేస్తాడు".

"మనం కూడా సహనం చూపిస్తే బలమైన వాళ్ళమవుతాము"

షబ్బీర్‌కు విషయం అర్థమయింది. ప్రతి కష్టం మన కోసం అల్లాహ్ ఇచ్చిన ఒక పరీక్ష. ఒక బహుమతి అంటూ అంతిమ దివ్య ఖుర్ఆన్ ఆయత్‌లను వినిపించాడు.

"అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం మోపడు"
(2: 286)


నిశ్చయంగా కష్టంతోపాటు సుఖం ఉంటుంది. అవును, కష్టంతోపాటు సౌలభ్యం కూడా ఉంటుంది
(94: 5,6)

తర్వాత అంతిమ దైవప్రవక్త(స) గారి హదీసును వినిపించాడు : "ఎవరైనా కష్టాల్లో సహనం చూపిస్తే అల్లాహ్ అతనికి మంచి మేలు చేస్తాడు".

షబ్బీర్ గురువు దగ్గరికి వెళ్ళి 'సలామ్' చేసి ఇంటికి బయలుదేరాడు.

గురువు గారు కూడా  దైవానికి  కృతజ్ఞతలు తెలుపుతూ తన శిష్యులకు మంచి జ్ఞానం ఇచ్చినందుకు సంతోషపడ్డారు.

తుదిగేటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**